ఈనాటి

# తెలుగోడు

PRGI-NO-APTEL/25/A2739

EENAATI TELUGODU... Telugu Daily

https://www.eenaatitelugodu.com








సంపుటి-1 | సంచిక - 147 | బుధవారం 25 ఫిబ్రవరి 2026 | పేజీలు -6 | వెల - రూ.. 5

Published From - Vijayawada, Anantapur, Sri Satyasai, Kurnool, Nandyala, Kadapa, Annamayya, Srikakulam, Nellore, chittoor, Tirupati




# మహాపాపం

- వైకాపా హయాంలో కల్తీ నెయ్యితో 20 కోట్ల లడ్డూల తయారీ...
- 2019-24 మధ్య 59.71లక్షల లీటర్ల కల్తీ నెయ్యి వినియోగం...
- రూ.231.51 కోట్ల అక్రమాలు జరిగినట్లు నిర్ధారణ...
- ఎన్‌డీడీబీ ఇచ్చిన రిపోర్టు ఆధారంగానే కల్తీ జరిగిందని చెప్పా...
- అధికారులు, నిపుణులు అందరూ కలిసి కుట్రలు చేశారు...
- మహాపాపం' పేరిట లడ్డూ కల్తీ పై అసెంబ్లీలో బాబు పవర్ పాయింట్ ప్రజెంటేషన్...

**అమరావతి (తెలుగోడు),ఫిబ్రవరి 24 :**

వైకాపా హయాంలో 20 కోట్ల లడ్డూలను కల్తీ నెయ్యితో తయారు చేశారని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. అధికారులు, నిపుణులు అందరూ కలిసి కుట్రలు చేశారని ఆక్షేపించారు. తిరుమల లడ్డూ వ్యవహారంపై శాసనసభలో నిర్వహించిన లఘు చర్చలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా 'మహాపాపం' పేరిట వైకాపా హయాంలో లడ్డూ కల్తీ జరిగిన తీరును పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ఆయన వివరించారు. రాజకీయ వివాదం ఉండకూడదని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో సిట్ ఏర్పాటు చేశారు. సీబీఐ ఆధ్వర్యంలో విచారణకు సిట్ ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు సూచించింది. తప్పు చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని సీబీఐ రిపోర్టు పంపించింది. అందుకే ఏకసభ్య కమిటీ వేయాలని నిర్ణయించాం. లడ్డూ వ్యవహారంలో కాకుండా అనేక విషయాల్లో తప్పులు చేశారు. 2019-24 మధ్య 59.71లక్షల లీటర్ల కల్తీ నెయ్యి వినియోగించారు. రూ.231.51 కోట్ల అక్రమాలు జరిగాయి. ఫుడ్ సేఫ్టీ నిబంధనలను నీరుగార్చారు. ఒక పద్ధతి ప్రకారం లాలూచీ పడిన లూటీ అని స్పష్టంగా తేలింది. కల్తీ నెయ్యి అని నిర్ధారణ అయినా రిపోర్టును తొక్కిపెట్టారు. లడ్డూలో జంతుకొవ్వు కలిసిందని నేను సొంతంగా ఏమీ చెప్పలేదు. ఎన్‌డీడీబీ ఇచ్చిన రిపోర్టునే చెప్పా. ఆ భగవంతుడే నాతో చెప్పించాడని చంద్రబాబు అన్నారు.

2లో

## మీరు అమ్మే నెయ్యి
# కల్తీనా.?

- వెయ్యిలోపు ధరలపై లోకేష్ వ్యాఖ్యలకు బొత్స సూటి ప్రశ్న..
- హెరిటేజ్ ఉత్పత్తుల ధరలు ప్రస్తావిస్తూ వివరణ ఇవ్వండి ..
- ఇందాపూర్ తయారీ కేంద్రంపై మాట మార్చారు ....
- మండలిలో అసంబంధ అంశాల ప్రస్తావనపై ఆగ్రహం..
- వైఎస్సార్ పేరును లాగడం సరికాదని హెచ్చరిక...


**అమరావతి (తెలుగోడు),ఫిబ్రవరి 24:**


2లో

శాసనమండలి విపక్ష నేత, వైఎస్సార్సీపీ సీనియర్ నాయకుడు బొత్స సత్యనారాయణ మంత్రి నారా లోకేష్ చేసిన వ్యాఖ్యలపై తీవ్ర స్థాయిలో కౌంటర్ ఇచ్చారు. వెయ్యి రూపాయల లోపు కిలో నెయ్యి దొరికితే అది కల్తీ అయ్యి ఉండే అవకాశముందని లోకేష్ చేసిన వ్యాఖ్యలను బొత్స తప్పుబట్టారు. మంగళవారం మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడిన ఆయన,

## సిబిఐ క్లారిటీ ఇచ్చినా
# ఆరోపణలా.!

- చంద్రబాబు డైరెక్షన్‌లోనే పవన్ మాట్లాడుతున్నారన్న ఆరోపణ
- నెయ్యి ట్యాంకర్ల వ్యవహారంలో కుట్ర ఆరోపణలు
- డెయిరీల యజమానులు, సంబంధాలపై ప్రశ్నల వర్షం



**అమరావతి (తెలుగోడు),ఫిబ్రవరి 24 :**

కూటమి నేతలకు దేవుడిపై నిజంగా నమ్మకం ఉందని ప్రజలు ఎలా నమ్మాలని వైఎస్సార్సీపీ నేత, మాజీ మంత్రి పేర్ని నాని ప్రశ్నించారు. అసెంబ్లీ సాక్షిగా పచ్చి అబద్ధాలు చెబుతున్న నాయకులు దేవుడి పేరు ప్రస్తావించడం విచిత్రంగా ఉందన్నారు. తిరుమల లడ్డూ అంశంపై నిరాధార ఆరోపణలు చేస్తూ ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని తీవ్రంగా మండిపడ్డారు. మంగళవారం తాడేపల్లిలోని వైఎస్సార్సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ తిరుమల లడ్డూలో జంతు కొవ్వు కలిసిందన్న ఆరోపణలకు ఎలాంటి ఆధారాలు లేవని, దీనిపై సీబీఐ స్పష్టత ఇచ్చిందని పేర్కొన్నారు. అయినప్పటికీ కూటమి నేతలు అదే ఆరోపణలను మళ్లీ మళ్లీ చేస్తున్నారని విమర్శించారు. ముఖ్యంగా నారా చంద్రబాబు నాయుడు సూచనలతోనే పవన్ కళ్యాణ్ మాట్లాడుతున్నారని, నారా లోకేష్తో కలిసి తప్పుడు ప్రచారం (మిగతా 2లో)

## భారత్‌ను అమెరికాకు
# అమ్మేశారు


- అమెరికాకు తలొగ్గిన ప్రధాని మోడీ..
- విమర్శలు గుప్పించిన రాహుల్...



**భోపాల్ (తెలుగోడు),ఫిబ్రవరి 24 :**

భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందంపై లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ మరోసారి ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై విమర్శల దాడి చేశారు. మోదీ రాజీపడ్డారని, అమెరికా ఒత్తిడికి తలవంచారని ఆరోపించారు. భోపాల్‌లో మంగళవారంనాడు జరిగిన కాంగ్రెస్ కిసాన్ మహాచౌపాల్ కార్యక్రమంలో మాట్లాడుతూ, దేశాన్ని అమ్మేశారని, భారతీయుల డాటాను అమెరికా చేతిలో పెట్టారని (మిగతా 2లో)

## యూత్ కాంగ్రెస్ చిల్లర చేష్టలు



- ఎఐ సమ్మిట్‌లో కాంగ్రెస్ నిరసనలు
- యూత్ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు చిబ్ అరెస్ట్

**న్యూ ఢిల్లీ (తెలుగోడు), ఫిబ్రవరి 24 :**

ఢిల్లీలోని భారత్ మండపంలో ఇటీవల జరిగిన ఎఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026 సందర్భంగా యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు చేసిన 'షర్ట్‌లెస్' నిరసనకు సంబంధించి.. యూత్ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు ఉదయ్ భాను చిబ్‌ను ఢిల్లీ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ నిరసన గురువారం సమ్మిట్ ఎగ్జిబిషన్ హాల్‌లో జరిగిన సంగతి తెలిసిందే. ఐదుగురు యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు షర్టులు విప్పేసి, ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేస్తూ, భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందానికి వ్యతిరేకంగా సందేశాలు రాసిన టీ-షర్టులు పట్టుకొని నిరసన తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీపై ఆరోపణలు గుప్పించారు. సెక్యూరిటీ సిబ్బంది.. వారిని వెంటనే బయటకు తీసుకెళ్లారు. ఈ ఘటన తర్వాత ఏడుగురు కార్యకర్తలను పోలీసులు అరెస్ట్ చేశారు. మంగళవారం ఢిల్లీ పోలీసులు ఉదయ్ భానును అరెస్టు చేశారు. ఆయన్ను తిలక్ మార్గ్ పోలీస్ స్టేషన్‌లో 15 గంటలకు పైగా

2లో

## మోహన్‌బాబు యూనివర్సిటీలో విద్యార్థిని
# అనుమానస్పద మృతి



**తిరుపతి (తెలుగోడు),ఫిబ్రవరి 24 :**

తిరుపతి జిల్లాలో విషాదం నెలకొంది. ప్రముఖ మోహన్ బాబు యూనివర్సిటీలో బీటెక్ డేటా సైన్స్ చివరి సంవత్సరం చదువుతున్న భువన అనే విద్యార్థిని అనుమానాస్పద స్థితిలో బలవన్మరణానికి పాల్పడటం స్థానికంగా కలకలం రేపుతోంది. తిరుమల పట్టణంలోని సాయితేజ ప్రైవేట్ మహిళల వసతి గృహంలో ఉంటున్న ఆమె సోమవారం రాత్రి తన గదిలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మంగళవారం ఉదయం తోటి విద్యార్థినులు గదిలోకి వెళ్లి ఈ విషయం గమనించి వసతి గృహ యాజమాన్యానికి సమాచారం అందించడంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. (మిగతా 2లో)

## జైళ్లలోనూ
# అంగన్‌వాడీ సెంటర్లు






- మహిళా ఖైదీల పిల్లలకు బంగారు భవిష్యత్..
- జైలు సంస్కరణల సవరణ బిల్లుకు అసెంబ్లీలో ఆమోదం..
- ఓపెన్ ఎయిర్ జైళ్లు, ఉన్నత విద్యా అవకాశాలు..
- హోంమంత్రి వంగలపూడి అనిత...

**అమరావతి (తెలుగోడు),ఫిబ్రవరి 24 :**

రాష్ట్రంలోని అన్ని వర్గాల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న ఏపీ ప్రభుత్వం జైళ్లలో ఉన్న ఖైదీల సంక్షేమంపై కూడా సానుకూల దృక్పథంతో ముందుకు సాగుతోంది. మహిళా ఖైదీల పిల్లల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని జైళ్లలో అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ విషయాన్ని హోంమంత్రి వంగలపూడి అనిత శాసనసభలో ప్రకటించారు. జైళ్లు, సంస్కరణల సవరణ బిల్లును ఆమె సభలో ప్రవేశపెట్టగా, దీనికి శాసనసభ ఆమోదం తెలిపింది.బిల్లును ప్రవేశపెట్టిన సందర్భంగా మంత్రి అనిత మాట్లాడుతూ ఖైదీల క్షమాభిక్ష విషయంలో ప్రభుత్వం సానుకూలంగా ఉందని స్పష్టం చేశారు. కేంద్ర చట్టాలకు అనుగుణంగానే రాష్ట్రంలో జైలు సంస్కరణలు అమలు చేస్తున్నామని తెలిపారు. జైలు జీవితం ఖైదీలకు శిక్ష మాత్రమే కాకుండా పరివర్తనకు మార్గం కావాలని ప్రభుత్వం భావిస్తోందన్నారు. జైళ్లు ఖైదీలకు పరివర్తనా నిలయాలుగా మారాలని ఆమె పేర్కొన్నారు.ఖైదీలకు ఉన్నత విద్యను అభ్యసించే అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామని, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను విస్తరించనున్నామని మంత్రి వివరించారు. ఖైదీలలో మానసిక మార్పు తీసుకురావాలంటే చట్టపరమైన మార్పులు అవసరమని అభిప్రాయపడ్డారు. ఖైదీలను వారి నేర చరిత్ర, ప్రవర్తన ఆధారంగా వర్గీకరించే విధానాన్ని అమలు చేస్తామని తెలిపారు.జైలు సంస్కరణల్లో భాగంగా ఓపెన్ ఎయిర్ జైళ్లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం (మిగతా 2లో)

## 40 ఏళ్ల అజ్ఞాతానికి
# మావోల వీడ్కోలు

- మావోయిస్ట్ పార్టీకి భారీ దెబ్బ..
- డిజిపి ఎదుట లొంగిన ప్రధాన నేతలు...
- లొంగిన వారిలో దేవ్‌జీ, మల్లా రాజిరెడ్డి, జగన్, గంగన్న...



**హైదరాబాదు (తెలుగోడు),ఫిబ్రవరి 24 :**

తెలంగాణలో నలుగురు మావోయిస్టు అగ్రనేతలు మంగళవారం రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి సమక్షంలో అధికారికంగా లొంగిపోయారు. వీరిలో పొలిట్ బ్యూరో సభ్యుడు (పీబీఎం) తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ అలియాస్ కుమ్మ దాదా, సెంట్రల్ కమిటీ సభ్యుడు (సీసీఎం) మల్లారాజి రెడ్డి అలియాస్ సంగ్రామ్ అలియాస్ రంగారం, తెలంగాణ రాష్ట్ర కమిటీ కార్యదర్శి బడే చొక్కారావు అలియాస్ దామోదర్ అలియాస్ జగన్, రాష్ట్ర కమిటీ సభ్యుడు (ఎస్‌సీఎం) నూనె నరసింహా రెడ్డి అలియాస్ గంగన్న అలియాస్ రన్నా దాదా ఉన్నారు. 40 ఏళ్లకు పైగా అజ్ఞాతంలో పనిచేసిన ఈ అగ్రనేతలు లొంగుబాటు నిర్ణయం తీసుకున్నారు. దీంతో మావోయిస్టు తెలంగాణ రాష్ట్ర కమిటీ పూర్తిగా నిర్వీర్యం అయినట్లు పోలీసులు ప్రకటించారు. ఈ నలుగురి లొంగుబాటుతో మావోయిస్టు పార్టీలో అగ్రస్థాయి బాధ్యతలు నిర్వహించిన ఇద్దరు కీలక నేతలు జనజీవన స్రవంతిలోకి వచ్చినట్లు డీజీపీ శివధర్ రెడ్డి తెలిపారు. మావోయిస్టు పార్టీలో తెలంగాణకు చెందిన ఇంకా 11 మంది అజ్ఞాతంలో ఉన్నారని అన్నారు. వారు కూడా త్వరలో జనజీవనంలోకి రావాలని డీజీపీ కోరారు. ముప్పాళ్ల లక్ష్మణ్ రావు అలియాస్ గణపతి అడవుల్లో లేరని, బయట ఎక్కడో షెల్టర్ తీసుకున్నట్లు గుర్తించామన్నారు. తెలంగాణ ప్రభుత్వ పునరావాస పథకం ప్రకారం తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీపై రూ.25 లక్షలు, మల్లారాజి రెడ్డిపై రూ.25 లక్షలు, బడే చొక్కారావు, నూనె నరసింహా రెడ్డిలపై రూ.20 లక్షల చొప్పున నగదు రివార్డు మొత్తాన్ని వారికి అందజేస్తామని ప్రకటించారు. 2019లో తెలంగాణలో మావోయిస్టులు రిక్రూట్‌మెంట్ జరిగిందని డీజీపీ శివధర్ రెడ్డి తెలిపారు. 1982లో సీపీఐ (ఎంఎల్) పీపుల్స్ వార్‌లో చేరిన తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ దండకారణ్యంలో ఆయుధ దళ కార్యకలాపాలు నిర్వహించారు. 1984-89 మధ్య సిరోంచా, పెరిమిలి ప్రాంతాల్లో దళ కమాండర్‌గా పనిచేశారు. 1989లో డివిజనల్ కమిటీ సభ్యుడిగా, 2001లో సెంట్రల్ కమిటీ, సెంట్రల్ మిలిటరీ కమిషన్ సభ్యుడిగా, 2017లో సీఎంసీ ఇన్‌ఛార్జ్‌గా, తర్వాత పొలిట్ బ్యూరో సభ్యుడిగా(పీబీఎం) ఎదిగారు. 1970లలో ఉద్యమంలోకి వచ్చిన మల్లారాజి రెడ్డి..1980లలో డివిజనల్ కమిటీ, రాష్ట్ర కమిటీ స్థాయికి ఎదిగారు. 1990లో సీసీఎంగా నియమితులయ్యారు. మహారాష్ట్ర, దండకారణ్య ప్రాంతాల్లో కీలక (మిగతా 2లో)

# మహాపాపం



(మొదటి పేజి (తరువాయి)

గత వైసీపీ పాలనలో ఎన్నో విధ్వంసాలు చూశామని ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. దేవాలయాలపై దాడులు జరిగాయని ప్రశ్నిస్తే కేసులు పెట్టారన్నారు. రాముడి విగ్రహం ధ్వంసం చేశారని ప్రశ్నిస్తే తనపైనే దాడికి దిగారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ప్రక్షాళన కోసం ఈవోను నియమించామని చెప్పారు. తన దృష్టికి వచ్చిన నేషనల్ డైయిరీ డెవలప్‌మెంట్ బోర్డ్ రిపోర్ట్ వివరాలు వెల్లడించానని తెలిపారు. శ్రీవారి లడ్డూ విషయంలోనే కాదు.. అనేక విషయాల్లో తప్పు చేశారంటూ వైసీపీ నేతలపై ఆయన మండిపడ్డారు. కుట్ర కోణాన్ని గుర్తించి తగిన చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. 59.71లక్షల కేజీల రసాయనాలతో కూడిన నెయ్యిని లడ్డూ తయారీలో వినియోగించారని వివరించారు. తద్వారా రూ. 234.51 కోట్ల అక్రమాలకు పాల్పడ్డారంటూ వైసీపీ అగ్రనేతలపై సీఎం చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. ల్యాబ్‌ల కళు ్లగప్పి నెయ్యి టెండర్లు దక్కించుకున్నారని విమర్శించారు. 2019 - 24 మధ్య రసాయనాలతో తయారు చేసిన నెయ్యితో 20 కోట్ల లడ్డూలు తయారు చేశారని పేర్కొన్నారు. అధికారులు, నిపుణులు అందరూ కలిసి కుట్రలు చేశారని సీఎం చంద్రబాబు గణాంకాలతో సహా వివరించారు. 2026 జనవరి 23న ఈ కల్తీ లడ్డూ వ్యవహారంలో సీబీఐ చార్జ్‌షీట్ వేసిందని గుర్తు చేశారు. అలిపిరి ఘటనలో శ్రీవేంకటేశ్వర స్వామి వారే తన ప్రాణాలను కాపాడారని సీఎం చంద్రబాబు గుర్తు చేసుకున్నారు. కల్తీ నెయ్యి వినియోగం లాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు సిట్ వేయాలని ఆలోచించినట్లు ఏపీ సీఎం తెలిపారు. సిట్ ఏర్పాటును వైసీపీ నేతలు సుప్రీంకోర్టులో సవాల్ చేశారని గుర్తు చేశారు. రాజకీయ వివాదం ఉండొద్దనే కేంద్ర, రాష్ట్ర అధికారులతో సిట్ ఏర్పాటు చేశామని వివరించారు. సీబీఐ ఆధ్వర్యంలో సిట్ ఏర్పాటు చేయాలని సుప్రీం సూచించిందన్నారు. తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని సీబీఐ రిపోర్టు పంపిందని పేర్కొన్నారు. సుబ్రహ్మణ్యస్వామి పిటిషన్‌ను సైతం సుప్రీంకోర్టు రద్దు చేసిందని గుర్తు చేశారు. అధికారులపై చర్యలు తీసుకోవాలని చెప్పినందుకే ఏకసభ్య కమిటీ అని సీఎం చంద్రబాబు ఈ సందర్భంగా స్పష్టం చేశారు. సీబీఐ రిపోర్టుతోపాటు ఫోరెన్సిక్ ఆధారాలను ప్రజలకు వివరిస్తున్నామని చెప్పారు. 2020 జనవరి, ఫిబ్రవరిలో టెండర్ల నిబంధనలు మార్చారని సీఎం చంద్రబాబు గుర్తు చేశారు. నాణ్యతా ప్రమాణాలకు సైతం వారు తిలోదకాలిచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2022 మేలో భోలేబాబా సంస్థపై ఫిర్యాదు, విచారణకు ఆదేశించారన్నారు. 2022 ఆగస్టులో బీటా సిటోస్టిరాల్‌తో రసాయనాలు కలిశాయని నివేదిక వచ్చిందని చెప్పారు. అఈఃఖీఎ ల్యాబ్ రిపోర్ట్ వస్తే.. దానిని సైతం తొక్కిపెట్టారన్నారు. 2024 జులై 23న రిపోర్ట్ వచ్చిందని.. అందులోని అంశాలనే భగవంతుడు తనతో చెప్పించాడని సీఎం చంద్రబాబు తెలిపారు. జంతు కొవ్వు కలిసిందని తాను సొంతంగా చెప్పలేదని స్పష్టం చేశారు. రోజుకు 4 లక్షల లీటర్ల పాలు కొనుగోలు చేయాలన్న నిబంధనను సైతం తొలగించారన్నారు. 2019 ఆగస్టులో టెండర్ నిబంధనల్లో సడలింపు చేశారని చెప్పారు. టర్నోవర్, పాల సేకరణ సామర్థ్యాన్ని కూడా తగ్గించారని పేర్కొన్నారు. 2020 జనవరిలో శ్రీ వైష్ణవి ప్లాంట్‌ను తనిఖీ చేసి.. ఉత్పత్తి సామర్థ్యం లేకపోయినా నెయ్యి సరఫరాకు అనుమతి ఇచ్చారన్నారు. కేజీకి రూ.329 చొప్పున భోలేబాబాకు నెయ్యి సరఫరా ఆర్డర్ ఇచ్చారని పేర్కొన్నారు. 2022 జూన్‌లో ఫతేపూర్‌లోని భోలేబాబా ఎ÷-లాంట్ తనిఖీ చేసి.. డబ్బులు ఇవ్వలేదని ఆ సంస్థపై అనర్హత వేటు వేశారని సీఎం చంద్రబాబు చెప్పారు. ఒక పథకం ప్రకారం తిరుమల పవిత్రతను దెబ్బ తీసేందుకు కుట్ర చేశారంటూ వైసీపీ నేతలపై సీఎం చంద్రబాబు మండిపడ్డారు. తిరుమలకు ఏ మతస్థులైనా రావొచ్చునని.. అన్యమతస్థులు శ్రీవారి దర్శనానికి వస్తే డిక్లరేషన్ ఇవ్వాల్సి ఉందన్నారు. అధికారంలో ఉన్నామని నిబంధనలు పూర్తిగా ఉల్లంఘించారని చెప్పారు. టెండర్ నిబంధనలను పూర్తిగా గాలికొదిలేశారన్నారు. నాటి టీటీడీ బోర్డు చైర్మన్ పీఏ చిన్నఅప్పన్న లంచం తీసుకుని దొరికిపోయారని చెప్పారు. ఇవన్నీ నాటి టీటీడీ చైర్మన్, బోర్డుకు తెలిసే జరిగాయని తెలిపారు. నాడు లడ్డూలో నాణ్యత తగ్గిపోయిందని చాలా ఆరోపణలు వచ్చాయని గుర్తు చేశారు. కల్తీ నెయ్యి తయారీకి ముఠాగా ఏర్పడ్డారని సీఎం చంద్రబాబు మండిపడ్డారు.నాటి టీటీడీ చైర్మన్ పీఏ చిన్నప్పన్న రూ.4.5 కోట్ల లంచం తీసుకున్నారన్నారు. నకిలీ సర్టిఫికెట్లతో టెండర్లు దక్కించుకుని రసాయనాల నెయ్యి సరఫరా చేశారని తెలిపారు. కల్తీ నెయ్యి తయారీకి వివిధ రకాల రసాయనాలు వినియోగించినట్టు దర్యాప్తులో తేలిందని సీఎం చంద్రబాబు వివరించారు.

# పులివెందులకు చేరుకున్న జగన్

పులివెందుల (తెలుగోడు), ఫిబ్రవరి 24 :

మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పులివెందుల చేరుకున్నారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా మంగళవారం, జగన్ పులివెందులకు బయల్దేరి వెళ్లారు. ఆయన ప్రజలను ప్రత్యక్షంగా కలుసుకుని సమస్యలు తెలుసుకో నున్నారు. పులివెందులలోని భాకరావిపురం క్యాంప్ ఆఫీస్‌లో ప్రజాదర్బార్ నిర్వహిస్తారు. రాత్రికి అక్కడి నివాసంలో





బస చేస్తారు. బుధవారం ఉదయం 9.30 గంటలకు పులివెందుల నివాసం నుంచి బయలుదేరి వేంపల్లి మండలం నందిపల్లి చేరుకుంటారు. అక్కడ వెలసిన నూతన నందీశ్వర ఆలయ విగ్రహ ప్రతిష్ట మహోత్సవాల సందర్భంగా జరిగే ప్రత్యేక పూజల్లో పాల్గొంటారు. మధ్యావిహ్నం పులివెందుల చేరుకుని భాకరాపురం క్యాంప్ ఆఫీస్‌లో ప్రజాదర్బార్ నిర్వహిస్తారు. రాత్రికి అక్కడి నివాసంలో బస చేస్తారు.

# కొండప్రాంతాల్లో రహదారులకు అడవితల్లి బాట

## రూ.1,077 కోట్లతో ఈ కార్యక్రమం అమలు
## అసెంబ్లీలో ప్రశ్నకు మంత్రి నాదెండ్ల సమాధానం

అమరావతి (తెలుగోడు), ఫిబ్రవరి 24 :

గిరిజన గ్రామాలు, కొండ ప్రాంతాల్లో రహదారి సౌకర్యాల కోసం 'అడవితల్లి బాట' కార్యక్రమం చేపట్టినట్లు అసెంబ్లీలో మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. రూ.1,077 కోట్లతో ఈ కార్యక్రమం అమలవుతోందని.. దీని ద్వారా సుమారు 4 వేల కిలోమీటర్ల మేర రహదారుల నిర్మాణం జరుగుతోందని మంత్రి వివరించారు. ఏపీ అసెంబ్లీ సమావేశాలు తొమ్మిదో రోజు ప్రారంభమయ్యాయి. సభ మొదలైన వెంటనే స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రశ్నోత్తరాలను చేపట్టారు. ఈ సందర్భంగా అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ 'అడవితల్లి బాట' కార్యక్రమంపై ప్రశ్న లేవనెత్తారు. ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సభలో లేకపోవడంతో పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ సమాధానం ఇచ్చారు. మన్యం ప్రాంతంలో సరైన రోడ్లు లేకపోవడంతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడేవారని మంత్రి అన్నారు. అనారోగ్యానికి గురైనప్పుడు వైద్యం కోసం డోలీల ద్వారా రోగులను తరలించాల్సి వచ్చేదని చెప్పుకొచ్చారు. అత్యవస పరిస్థితిల్లో ప్రాణాలకు ముప్పు కూడా వాటిల్లే పరిస్థితి వుందన్నారు. అడవుల్లో వుండే చెంచులు, ఇతరులకు కూడా వైద్య విద్యం అందజేయాలన్నదే కూటమి లక్ష్యమన్నారు. అడవుల్లోని మారుమూల ప్రాంతాలకు కూడా రహదారి సౌకర్యం కల్పించి యధేచ్ఛగా వాహనాల రాకపోకలు కొనసాగే విధ్యంగా చర్యలు చేబట్టి వారి పరిస్థితిని మార్చాలనే ఉద్దేశంతో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ 'అడవితల్లి బాట' కార్యక్రమాన్ని చేపట్టారని నాదెండ్ల మనోహర్ వివరించారు. అలాగే ఒడిశా సరిహద్దులోని కొటియా గ్రామాల సమస్యను కొణతాల రామకృష్ణ సభలో ప్రస్తావించారు. ఈ గ్రామాల ప్రజలు రెండు రాష్టాల్లో ఓటుహక్కును కలిగి ఉన్నారన్నారు. అయితే.. ఏపీ అధికారులు అక్కడికి వెళ్లకుండా ఒడిశా పోలీసులు అడ్డుకుంటున్నారని ఆయన తెలిపారు. ఈ సమస్యపై ప్రభుత్వం జోక్యం చేసుకుని త్వరగా పరిష్కరించాలని ఎమ్మెల్యే కోరారు.

# మీరు అమ్మే నెయ్యి కల్తీనా..?

(మొదటి పేజి (తరువాయి)

హెరిటేజ్ నెయ్యి ధరల వివరాలు ప్రస్తావిస్తూ లోకేష్‌ను సూటిగా ప్రశ్నించారు.“హెరిటేజ్ 750 ఎంఎల్ నెయ్యి రిలయన్స్లో 456 రూపాయలకు దొరుకుతుంది. అదే హెరిటేజ్లో లీటర్ ఆవు నెయ్యి 608 రూపాయలకు విక్రయిస్తున్నారు. మరి వెయ్యిలోపు నెయ్యి కల్తీ అయితే, మీరు అమ్మేది కల్తీనా?” అంటూ బొత్స ప్రశ్నించారు. ఒకవైపు వెయ్యిలోపు ధరలపై అనుమానం వ్యక్తం చేస్తూ, మరోవైపు తమ సంస్థ ఉత్పత్తులు అదే ధరల్లో విక్రయించడం ఎలా సాధ్యమవుతుందో చెప్పాలని నిలదీశారు. ప్రజల్లో అపోహలు కలిగించేలా వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు.హెరిటేజ్ వెబ్‌సైట్‌లో ఉన్న వివరాలను ఎందుకు ప్రస్తావించలేదని కూడా బొత్స ప్రశ్నించారు. మొదట ఇందాపూర్‌ను తయారీ కేంద్రంగా పేర్కొని, తర్వాత కో-మ్యానుఫ్యాక్చర్ అంటూ మాట మార్చడం వెనుక ఉద్దేశ్యం ఏమిటని నిలదీశారు. ప్రజలకు స్పష్టమైన సమాచారం ఇవ్వాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందని, మాట మార్చడం ద్వారా గందరగోళం సృష్టించడం తగదన్నారు.ఆహార పదార్థాల విషయంలో అనుమానాలు రేకెత్తించేలా మాట్లాడితే మార్కెట్‌లో అయోమయం ఏర్పడుతుందని బొత్స అభిప్రాయపడ్డారు. రైతులు, వినియోగదారులు ఇబ్బందులు పడే పరిస్థితి తలెత్తవచ్చని హెచ్చరించారు. రాజకీయ విమర్శలు చేయాలంటే ఆధారాలతో మాట్లాడాలని సూచించారు. ఉత్పత్తుల నాణ్యత, తయారీ ప్రదేశాలపై స్పష్టత ఇవ్వకుండా ఇతరులపై ఆరోపణలు చేయడం ద్వంద్వ వైఖరిని సూచిస్తుందని విమర్శించారు. ఇక శాసనమండలిలో జరిగిన చర్చలోనూ బొత్స గట్టిగా స్పందించారు. శాంతి భద్రతల అంశంపై చర్చ జరుగుతుండగా సంబంధం లేని విషయాలను టీడీపీ ఎమ్మెల్సీ ప్రస్తావించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. “వైఎస్సార్ తండ్రిని ఎవరు చంపారు? తన తండ్రిని చంపిన వారిపై వైఎస్సార్ కక్ష తీర్చుకుని ఉంటే ఈ రోజు ఇలా మాట్లాడి ఉండేవారా?” అంటూ సభలో చేసిన వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. సభా మర్యాదలు పాటించకుండా వ్యక్తిగత అంశాలను లాగడం సరికాదని మండిపడ్డారు.సభకు సంబంధించిన అంశాలపైనే చర్చ జరగాలని, చరిత్రను వక్రీకరించి రాజకీయ లాభం పొందాలని చూడడం తగదని బొత్స హెచ్చరించారు. ప్రజా సమస్యలు, శాంతి భద్రతల వంటి కీలక అంశాలపై చర్చించాల్సిన సమయంలో వ్యక్తిగత ఆరోపణలు చేయడం సభ గౌరవాన్ని దెబ్బతీస్తుందని అన్నారు. బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని సూచించారు.మొత్తంగా లోకేష్ చేసిన వ్యాఖ్యలకు బొత్స ఇచ్చిన కౌంటర్ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. హెరిటేజ్ నెయ్యి ధరల అంశం నుంచి మండలి చర్చల వరకు పలు విషయాలపై ఆయన చేసిన వ్యాఖ్యలు అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధానికి దారితీశాయి.

# సిబిఐ క్లారిటీ ఇచ్చినా ఆరోపణలా

(మొదటి పేజి (తరువాయి)

సాగిస్తున్నారని ఆరోపించారు. తిరుమల లడ్డూ విషయంలో ఇష్టానుసారంగా ఆరోపణలు చేస్తూ జగన్‌పై విషం కక్కుతున్నారని, దేవుడిపై భక్తి, భయం ఉంటే ఇలాంటి వ్యాఖ్యలు చేయరని అన్నారు. విజయవాడలో అనేక ఆలయాలను కూల్చివేసింది చంద్రబాబు ప్రభుత్వమేనని, ప్రసిద్ధ కాశీనాయన క్షేత్రంలో సత్రాలను కూల్చిన విషయం ప్రజలు మర్చిపోలేదన్నారు. కూటమిలో ఉన్న పవన్ కళ్యాణ్ ఈ అంశాలపై ఎందుకు స్పందించరని ప్రశ్నించారు. సింహాచలం ఘటన, తిరుపతిలో జరిగిన తొక్కిసలాట, తిరుచానూరులో వారాహి అమ్మవారి ఆలయ కూల్చివేత, గోదావరి పుష్కరాల్లో జరిగిన ప్రాణనష్టం వంటి ఘటనలపై బాధ్యత ఎవరిదని నిలదీశారు. తిరుమలలో వెయ్యికాళ్ల మంటపాన్ని కూల్చివేసింది కూడా చంద్రబాబు ప్రభుత్వమేనని ఆరోపించారు. రామతీర్థంలో విగ్రహం ధ్వంసం చేసిన వ్యక్తికి డబ్బులు ఇచ్చారన్న ఆరోపణలు చేశారు. అంతర్వేదిలో రథం తగులబడినప్పుడు జగన్ హయాంలో కోటి రూపాయలతో కొత్త రథాన్ని నిర్మించామని, రామతీర్థంలో రూ.3 కోట్లతో రాతి నిర్మాణం చేసినట్లు పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వందల కోట్లతో ఆలయాల అభివృద్ధి పనులు చేపట్టినట్లు వివరించారు. శ్రీవాణి ట్రస్టును రద్దు చేస్తామని చెప్పిన చంద్రబాబు, పవన్ ఇప్పుడు ఎందుకు కొనసాగిస్తున్నారని ప్రశ్నించారు. జగన్ హయాంలో శ్రీవాణి ట్రస్టు కింద 5,263 ఆలయ పనులు జరిగాయని తెలిపారు. తిరుమలలో అవినీతి జరుగుతుందనే ఆరోపణలు ఉన్నప్పుడు దానిపై విచారణ చేయడానికి చంద్రబాబుకు ధైర్యం ఉందా అని సవాల్ విసిరారు. గదులు పొందాలంటే లంచాలు ఇవ్వాల్సిన పరిస్థితి ఉందని ఆరోపించారు. నెయ్యి ట్యాంకర్ల వ్యవహారంలో కూడా కుట్ర జరిగిందని పేర్ని నాని ఆరోపించారు. జూలైలో నెయ్యి శాంపిల్స్ పరీక్షించి నాలుగు ట్యాంకర్లను వెనక్కు పంపారని, ల్యాబ్ నివేదికల ఆధారంగా చర్యలు తీసుకున్నారని తెలిపారు. ఆ ట్యాంకర్లను మళ్లీ వేరే పేరుతో కొండపైకి పంపించారని ఆరోపించారు. వైష్ణవి, బోలేబాబా డెయిరీల యాజమాన్యం, వాటి సంబంధాలపై ప్రశ్నలు లేవనెత్తారు. సంగం డెయిరీ, హెరిటేజ్ తదితర సంస్థలతో ఉన్న అనుబంధాలపై స్పష్టత ఇవ్వాలన్నారు. ఆల్ఫా, మాల్ గంగా, ప్రీమియర్ డెయిరీలు కల్తీ నెయ్యి సరఫరా చేశాయని ఆరోపిస్తున్న వారు అధికారంలోకి వచ్చిన తర్వాత ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. 2022లో వచ్చిన నివేదికలపై చర్యలు తీసుకోలేదన్న ఆరోపణలు చేస్తున్న కూటమి నేతలు, ఆ నివేదికలపై అసలు సీబీఐ ఏమన్నదో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. మొత్తానికి తిరుమల లడ్డూ అంశాన్ని రాజకీయ లాభం కోసం ఉపయోగించుకుంటూ కూటమి నేతలు దుష్ప్రచారం చేస్తున్నారని, వాస్తవాలు బయటకు వస్తే ప్రజలే నిజాన్ని గ్రహిస్తారని పేర్ని నాని పేర్కొన్నారు.

## కల్తీ నెయ్యి వ్యవహారంలో
# దోషులకు శిక్ష పడాల్సిందే

## ఆనాటి బోర్డును జగన్ ఎందుకు వెనకేసుకొస్తున్నారు...
## రసాయనాలతో కల్తీ నెయ్యి సరఫరా జరిగిందని రుజువయ్యింది...
## అసెంబ్లీలో డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్



అమరావతి (తెలుగోడు), ఫిబ్రవరి 24 :

కల్తీ నెయ్యి వ్యవహారంలో దోషులు ఎవరైనా సరే శిక్ష పడాల్సిందేనని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అన్నారు. తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంపై శాసనసభలో జరిగిన లఘు చర్చలో ఆయన మాట్లాడారు. కల్తీనెయ్యిలో ఏ రసాయనాలు వాడారో ఆ పెరుమాళ్లకే తెలియాలి. జంతు సంబంధ రసాయనాలు ఉన్నాయని ఎన్‌డీడీబీ రిపోర్టు చెప్పింది. అది నెయ్యే కాదని సీబీఐ రిపోర్టు ఇచ్చింది. ఇది ధర్మానికి సంబంధించిన విషయం. సకల మతాలను గౌరవించడం ఈ దేశ సంస్కృతి. తితిదే పాత బోర్డును జగన్ ఎందుకు వెనకేసుకొస్తున్నారు? అంటే ఆయనకూ భాగం ఉన్నట్టే కదా?' అని పవన్ అన్నారు. శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో నెయ్యి ఉపయోగించలేదని ఇప్పటికే తేలిపోయిందన్నారు. నెయ్యిలో రసాయనాలు కలవలేదని వైసీపీ అబద్ధాలు చెబుతోందని.. అందుకే తాము వివరణ ఇవ్వాల్సి వచ్చిందని పవన్ తెలిపారు. కల్తీ నెయ్యి తయారీలోనూ సృజనాత్మకత చూపించారని.. నెయ్యి కావాలంటే పాల నుంచే కాదు రసాయనాల నుంచీ తయారు చేయొచ్చని నిరూపించారని ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వాధినేత తప్పుచేశారని తానెక్కడా చెప్పలేదని.. అప్పటి టీటీడీ పాలకమండలి తన బాధ్యత నిర్వహణలో విఫలమైందని విమర్శించారు. తాము ఏ ఒక్కరిపైనా ఆరోపణలు చేయడం లేదని.. జగన్ నియమించిన బోర్డు హయాంలోనే తప్పు జరిగిందని డిప్యూటీ సీఎం అన్నారు. నాటి టీటీడీ బోర్డు సభ్యులను మాజీ సీఎం జగన్ ఎందుకు వెనకేసుకొస్తున్నారని ప్రశ్నించారు. 'దర్యాప్తు జరిపి చర్యలు తీసుకోవచ్చని జగన్ చెబితే సరిపోయేది.. వెనకేసుకొస్తున్నారంటే మీకూ భాగస్వామ్యం ఉన్నట్టే కదా?' అని అనుమానం వ్యక్తం చేశారు పవన్. అసలు నెయ్యిలో రసాయనాలు కలవలేదని వైసీపీ నేతలు చెప్పడమేంటని నిలదీశారు. ప్రసాదాన్ని అపవిత్రం చేసేందుకు కుట్ర జరిగిందని సిట్ తేల్చిందని చెప్పారు. నచ్చినవారికి కాంట్రాక్టులు ఇచ్చుకునేందుకు నిబంధనలు సడలించారని పవన్ ఆరోపించారు. రూ.20 కోట్ల లడ్డూలు రసాయనాల నెయ్యితో తయారైనట్టు తేలిందని, రసాయనాలతో తయారైన లక్ష లడ్డూలను అయోధ్యకు పంపారని ఈ సందర్భంగా పవన్ తెలిపారు. కల్తీ నెయ్యి కేసులో దోషులెవరైనా శిక్ష పడాల్సిందేనని స్పష్టం చేశారాయన. ఆ నెయ్యిలో.. ఏ రసాయనాలు ఉన్నాయో శ్రీవారికే తెలియాలన్నారు డిప్యూటీ సీఎం. నెయ్యిలో జంతు సంబంధ రసాయనాలు ఉన్నాయని ఎన్‌డీడీబీ రిపోర్టు ఇచ్చిందని.. అది అసలు నెయ్యే కాదని సీబీఐ సిట్ రిపోర్ట్ ఇచ్చిందని తెలిపారు. ఇది స్వామివారికి కాకుండా ఇతర ఏ మతానికి జరిగినా దేశం గగ్గోలు పెట్టేదని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు.

# యూత్ కాంగ్రెస్ చిల్లర చేష్టలు

(మొదటి పేజి (తరువాయి)

విచారించిన తర్వాత అరెస్ట్ చేశారని సమాచారం. దీంతో ఈ కేసులో మొత్తం అరెస్ట్‌ల సంఖ్య ఎనిమిదికి చేరింది. పోలీసులు ఆయనపై.. కుట్రలో పాత్ర ఉందని, విచారణకు సహకరించలేదని, తప్పుదారి పట్టించే ప్రయత్నం చేశారని ఆరోపించారు. త్వరలోనే కోర్టులో ప్రవేశపెట్టనున్నారు. భూపేశ్ బాఘేల్ వంటి సీనియర్ నేతలు ఈ అరెస్ట్‌ను తీవ్రంగా ఖండించారు. 'ప్రజాస్వామ్యంలో యువత ప్రశ్నలు వేయడం, నిరసన తెలపడం నేరం కాదు,అది ప్రజాస్వామ్య ఆయుధం' అని బాఘేల్ అన్నారు. ఈ అరెస్ట్‌లను అరాచక, అన్యాయ చర్యలుగా పేర్కొన్నారు. నిరసన శాంతియుతం గా జరిగిందని, యువత బాధలను బయటపెట్టడమే ఉద్దేశ్యమని కాంగ్రెస్ వర్గాలు వాదిస్తున్నాయి. బీజేపీ నేత ప్రదీప్ భండారి ఈ నిరసనను 'నేక్డ్ యాంటీ-ఇండియా ప్రొటెస్ట్' అని మండిపడ్డారు. కాంగ్రెస్‌ను యాంటీ-ఇండియా, యాంటీ-గ్రోత్ పార్టీగా విమర్శించారు. 'యువతకు కాంగ్రెస్ 'నంగి' పార్టీగా కనిపిస్తోంది' అని ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఎఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026 భారతదేశంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో జరుగుతున్న చర్చలు, ప్రదర్శనలకు సంబంధించింది. దీనిని అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన ఈవెంట్‌గా చూస్తున్నారు. అయితే.. ఈ నిరసన వెనుక రాజకీయ కుట్ర కోణం ఉందని, దేశం పరువు మంటగలపాలన్నది వీరి పన్నాగమని బీజేపీ వర్గాలు మండిపడు తున్నాయి.

# జైళ్లలోనూ అంగన్‌వాడీ సెంటర్లు

(మొదటి పేజి (తరువాయి)

నిర్ణయించింది. ఈ జైళ్ల ద్వారా ఖైదీలకు వ్యవసాయం సహా ఇతర వృత్తుల్లో శిక్షణ అందించి, సమాజంలో తిరిగి స్థిరపడేలా చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని అనిత చెప్పారు. ఖైదీల మానసిక పరివర్తనకు ఇది దోహదపడుతుందని ఆమె విశ్వాసం వ్యక్తం చేశారు. మరోవైపు, పొన్నూరు టీడీపీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర రాష్ట్రంలోని జైళ్లలో సౌకర్యాల కొరతపై ఆందోళన వ్యక్తం చేశారు. ఖైదీల సంఖ్య పెరుగుతున్నప్పటికీ అవసరమైన మౌలిక వసతులు మెరుగుపడటం లేదని ఆయన ప్రశ్నించారు. ఈ అంశంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.

# 40ఏళ్ల అజ్ఞాతానికి మావోల వీడ్కోలు

(మొదటి పేజి (తరువాయి)

బాధ్యతలు నిర్వహించారు. 2007లో పీబీ సభ్యత్వం, 2010-16 మధ్య ఛత్తీస్‌గఢ్-ఒడిశా సరిహద్దు స్పెషల్ జోనల్ కమిటీ ఇన్‌ఛార్జ్‌గా వ్యవహరించారు. 1996లో ఆర్‌ఎస్‌యూ ద్వారా పార్టీలో చేరి 1999-2000లో ఏటూరునాగారం-మహాదేవపూర్ ప్రాంతాల్లో పార్టీ సభ్యుడిగా పనిచేశారు. తెలంగాణ రాష్ట్ర కమిటీ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. తెలంగాణ, ఇతర ప్రాంతీయ కమిటీలలో కీలక బాధ్యతలు చేపట్టారు. నూనె నరసింహ రెడ్డి కూడా రాష్ట్ర కమిటీ స్థాయిలో కీలక పాత్ర పోషించారు. మావోయిస్టు అగ్రనేతలు నలుగురు నేడు తెలంగాణ పోలీసుల ముందు లొంగిపోయిన సంగతి తెలిసిందే. దేవ్‌జీ అలియాస్ తిప్పిరి తిరుపతి(పొలిట్ బ్యూరో కమిటీ మెంబెర్).. మల్లా రాజిరెడ్డి అలియాస్ సంగ్రామ్(సెంట్రమ్ కమిటీ మెంబెర్).. బడే చొక్కారావు అలియాస్ దామోదర్ అలియాస్ జగన్(తెలంగాణ స్టేట్ సెక్రటరీ).. నూనె నరసింహారెడ్డి అలియాస్ గంగన్న సన్ను దాదా (స్టేట్ కమిటీ మెంబర్) పోలీసుల ముందు లొంగిపోయారు. పోలీసులు ఈ నలుగురినీ మంగళవారం మీడియా ముందుకు తీసుకువచ్చారు.

# భారత్‌ను అమెరికాకు అమ్మేశారు..

(మొదటి పేజి (తరువాయి)

మోదీని విమర్శించారు. 'వ్యవసాయం, వ్యవసాయ ఉత్పత్తులతో ముడిపడిన కారణంగా అమెరికాతో వాణిజ్య ఒప్పందం నాలుగు నెలలుగా నిలిచిపోయింది. పార్లమెంటు ప్రసంగంలో కేవలం ఆర్మీ మాజీ చీఫ్ నవరణెళి గురించే నేను మాట్లాడలేదు. నా ప్రసంగం పూర్తికాగానే సొంత మంత్రులను కూడా సంప్రదించ కుండా మోదీ ట్రంప్‌తో మాట్లాడారు. మహిళా ఎంపీలు దాడి చేయాలనుకున్నారంటూ అబద్దాలు చెప్పారు. దానికి బదులుగా అమెరికాతో డీల్‌కు రెడీగా ఉన్నట్టు ఆయన సూటిగా చెప్పి ఉండవచ్చు. మోదీ కళ్లలో భయం స్పష్టంగా కనిపించింది' అని రాహుల్ అన్నారు.అమెరికా సుప్రీంకోర్టు తీర్పుతో ఆదేశంతో ట్రేడ్ ఒప్పందాలను వదులుకోవాలని ఇతర దేశాలు నిర్ణయం తీసుకుంటే, మోదీ మాత్రం మౌనంగా ఉండిపోయారని రాహుల్ విమర్శించారు. 'ఇదే వేదిక నుంచి మోదీని సవాలు చేస్తున్నాను. డీల్‌పై అమెరికా సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినందున ఆ దేశంతో వాణిజ్య ఒప్పందాన్ని రద్దు చేసుకోవాలి. ట్రంప్ ఒత్తిడి కారణంగానే డీల్‌ను మోదీ రద్దు చేసుకున్నారు. భారతదేశం అత్యధిక జనాభా కలిగిన దేశం. డాటా కూడా పెద్దదే. కానీ మోదీ మన డాటాను అమెరికాకు ఇచ్చేశారు. ఆయన మీద ఒత్తిడి లేకపోతే ఆ పని చేసేవారు కాదు. తన ప్రతిష్ట, రాజకీయ భవిష్యత్తును కాపాడుకునేందుకు దేశాన్ని ఆయన అమ్మేశారు' అని మోదీపై రాహుల్ తీవ్ర విమర్శలు చేశారు.

# మోహన్‌బాబు యూనివర్సిటీలో విద్యార్థిని అనుమానస్పద మృతి

(మొదటి పేజి (తరువాయి)

ఈ ఘటనలో వసతి గృహ యాజమాన్యం వ్యవహరించిన తీరుపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. భువన మృతి చెందిన విషయాన్ని తమకు చాలా ఆలస్యంగా తెలియజేశారని మృతురాలి తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. తాము అక్కడికి చేరుకుని ఆందోళన వ్యక్తం చేసిన తరువాతే యాజమాన్యం పోలీసులకు సమాచారం ఇచ్చిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చదువులో చురుగ్గా ఉండే భువన ఆత్మహత్య చేసుకునేంత బలహీనురాలు కాదని, ఆమె మృతి వెనుక ఇతర కారణాలు ఉన్నాయా అనే కోణంలో సమగ్ర దర్యాప్తు జరపాలని కుటుంబ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు.ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని శవపరీక్ష నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. తిరుపతి జిల్లా పుత్తూరు మండలం మంగళం పంచాయతీకి చెందిన రైతు సురేందర్ రెడ్డి, జానకి దంపతుల కుమార్తె అయిన భువన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కావాలన్న ఆశతో డేటా సైన్స్ కోర్సు చేస్తోంది. మరికొద్ది రోజుల్లో చదువు పూర్తికావాల్సి ఉండగా ఇలా విగతజీవిగా మారడం ఆ కుటుంబంలో తీరని విషాదాన్ని నింపింది. చదువుల ఒత్తిడి లేక వ్యక్తిగత కారణాలు ఏవైనా ఉన్నాయా అనే కోణంలో పోలీసులు వసతి గృహ సిబ్బంది, స్నేహితులను విచారిస్తున్నారు. ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# కన్నతల్లి కర్కశత్వం

హైదరాబాద్ (తెలుగోడు), ఫిబ్రవరి 24 :

దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం దారుణం చోటుచేసుకుంది. రెండు నెలల బాలుడిని కన్న తల్లి అత్యంత దారుణంగా హత్య చేసింది. బాలుడిని కట్టెల పొయ్యిలో వేసి కాల్చి చంపింది. ఏడవకుండా నోట్లో బట్టలు కుక్కి, కాళ్లు కట్టేసి మరి హత్య చేసింది. బౌరంపేట్ ప్రాంతంలో ఈ అమానుష ఘటన జరిగింది. ఈ ఘటనపై స్థానికుల పోలీసులకు సమాచారం ఇచ్చారు. దుండిగల్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బాలుడి మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. అసలు పసిబిడ్డను చంపడానికి ఆమెకు మనస్సు ఎలా వచ్చిందంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆ తల్లి ఇలా ఎందుకు చేసిందో తెలియాల్సి ఉంది. అలానే ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. పోలీసులు వివరాలు సేకరించారు.



అంగన్వాడీల దీక్షలకు మద్దతు తెలుపుతున్న సిఐటియు జిల్లా నాయకులు

## అంగన్వాడీ వర్కర్ల రిలే దీక్షలకు జిల్లా సిఐటియు నాయకుల మద్దతు

**గుత్తి (తెలుగోడు), ఫిబ్రవరి 24 :**
పెండింగ్లో ఉన్న అంగన్వాడీ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు ఆధ్వర్యంలో గుత్తి ఐసిడిఎస్ కార్యాలయం వద్ద చేస్తున్న దీక్షలకు రెండవ రోజు సిఐటియు జిల్లా అధ్యక్షుడు ఆర్ వి నాయుడు, సిఐటియు మండల కార్యదర్శి నిర్మల తదితరులు దీక్షా శిబిరాన్ని సందర్శించి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీ వర్కర్ల సమస్యలు పరిష్కారం కోసం జరిగే రిలే దీక్షలకు మద్దతు ఇస్తూన్నట్లు నాయకులు పేర్కొన్నారు.ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్వి నాయుడు మాట్లాడుతూ అంగన్వాడీ వర్కర్లకు అండ్ హెల్పర్లకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని వారి డిమాండ్లు పరిష్కారం అయ్యేవరకు పోరాటాలకు సంపూర్ణ మద్దతు ఇస్తామని తెలియజేశారు. ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్వాడీ వర్కర్ల సమస్యలు పరిష్కరించకపోతే చలో విజయవాడ కార్యక్రమానికి అందరూ కదిలి రావాలని తెలిపారు. గత ప్రభుత్వంలో అంగన్వాడీ వర్కర్లు 42 రోజులపాటు సమ్మె నిర్వహిస్తున్నప్పుడు తెలుగుదేశం ప్రభుత్వం మేము వస్తే మీ సమస్యలు పరిష్కరిస్తామని సమ్మె టెంట్ల దగ్గర హామీలు ఇవ్వడం జరిగింది అన్నారు మరి ఇప్పుడు ఎందుకు అంగన్వాడి వర్కర్ల సమస్యలు పరిష్కరించలేకపోతున్నారు .వారి డిమాండ్లు నెరవేర్చలేక పోతున్నారో ప్రభుత్వమే సమాధానం ఇవ్వాలని తెలిపారు. ఇప్పటికైనా అంగన్వాడీ వర్కర్ల సమస్యల పరిష్కరించకపోతే రాబోవు దినాల్లో ఉద్యమాలు పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు సిఐటియు మండల కార్యదర్శి వి నిర్మల. మహిళా సంఘం మండల కార్యదర్శి రేణుక. వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు చందు ఉపాధ్యక్షురాలు ఓనర్ అమ్మ ఊర్మిళ హమాలీ సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు అంగన్వాడీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



పెద్దమ్మ తల్లి అమ్మవారికి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహిస్తున్న భక్తులు

## పెద్దమ్మతల్లి అమ్మవారికి ప్రత్యేక పూజలు

**యాడికి (తెలుగోడు), ఫిబ్రవరి 24 :**
యాడికి మండల కేంద్రంలోని మెయిన్ బజార్లో ఉన్న శ్రీ పెద్దమ్మ తల్లి అమ్మవారికి మంగళవారం అత్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మంగళవారం అష్టమి సందర్భంగా వివిధ గ్రామాలలో ఉన్న పెద్దమ్మతల్లి అమ్మవారి భక్తులు చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలకు వచ్చిన భక్తులు పెద్దమ్మ తల్లి అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి అభిషేకాలు. అర్చనలు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.



పెద్దమ్మ తల్లి అమ్మవారికి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహిస్తున్న భక్తులు

## పారిశుద్ధ్య కార్మికులకు సేఫ్టీ కిట్స్ పంపిణీ

**బెళగుప్ప (తెలుగోడు), ఫిబ్రవరి 24 :**
బెళుగుప్ప గ్రామ సచివాలయంలో మంగళవారం సుజలాన్ సంస్థ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులకు సేఫ్టీ కిట్స్ పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీడీవో లక్ష్మీనారాయణ, స్థానిక సహకార సంఘం అధ్యక్షులు కంచిరాముడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిరోజు ఉదయం మన పరిసరాలను శుభ్రం చేసే పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్యం కూడా చాలా ముఖ్యమని, వారు కూడా ఆరోగ్యంగా ఉండేందుకు పారిశుద్ధ్య పనులు చేసే సమయంలో సేఫ్టీ కిట్స్ ను వాడాలన్నారు. అందుకు సుజలాన్ సంస్థ పారిశుద్ధ్య కార్మికులకు అందించిందన్నారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులకు సేఫ్టీ కిట్స్ ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మీనారాయణ, సహకార సంఘం అధ్యక్షులు కంచి రాముడు, ఎంపీడీవో కార్యాలయం సూపరిండెండెంట్ కృష్ణా నాయక్, పంచాయతీ కార్యదర్శి మంజునాథ్, నాయకులు నక్కలపల్లి వెంకటరామిరెడ్డి, సుజిలాన్ సాహస కోఆర్డినేటర్ అమరేష్, సూపర్వైజర్ ఆంజనేయులు, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో లక్ష్మీనారాయణ
పారిశుద్ధ్య కార్మికులకు సేఫ్టీ కిట్స్ పంపిణీ చేస్తున్న ఎంపీడీవో లక్ష్మీనారాయణ, సహకార సంఘం అధ్యక్షులు కంచి రాముడు ఇతర అధికారులు

## కులధృవీకరణ పత్రాల కోసం బాలసంతు కులస్తుల ధర్నా

**పామిడి (తెలుగోడు), ఫిబ్రవరి 24 :**
బుడగ జంగం కులం స్థానంలో బాలసంతు కులధృవీకరణ పత్రాలను మంజూరు చేయాలంటూ మంగళవారం తహశీల్దార్ కార్యాలయం ముందు బాలసంతు కులస్తులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పి.కొండాపురం గ్రామస్థులైన తమను బాలసంతు కులస్థులుగా గుర్తించి కులధృవీకరణ పత్రాలను మంజూరు చేయాలని ప్రజాసమస్యల పరిస్కార వేదికలో విన్నవించినప్పటికీ పట్టించుకోకపోవటం దారుణం అన్నారు. గుంతకల్లు , గార్లదిన్నె మండలాల్లో తమ కులస్థులకు బాలసంతు కులధృవీకరణ పత్రాలను మంజూరు చేశారని, పామిడిలో మాత్రమే కాలయాపన చేస్తున్నారని వాపోయారు. కులధృవీకరణ పత్రాలు మంజూరు కాకపోవటంతో అటు



న్యాయం చేస్తామని హామీ ఇస్తున్న తహశీల్దార్ షర్మిల



కులధృవీకరణ పత్రాల కోసం ధర్నా చేస్తున్న బాలసంతు కులస్తులు

విద్యాభ్యాసం ఇటు సంక్షేమ పథకాలకు దూరం అయ్యామని వెంటనే బుడగ జంగం కులం స్థానంలో బాలసంతు కులధృవీకరణ పత్రాలను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కులధృవీకరణ పత్రాలను మంజూరు చేస్తారా.. లేదంటే భిక్షాటన చేసుకోవాలా.. అంటూ పశు లక్షన్న, కెప్టెన్ కుళ్ళాయప్ప, నరసప్ప, లడ్డు లక్షన్న తదితరులు నినాదాలు చేశారు. దీంతో తహసీల్దార్ షర్మిల మాట్లాడుతూ పామిడి మండలంలో ఇప్పటివరకూ బాలసంతు కులధృవీకరణ పత్రాలను మంజూరు చేయలేదన్నారు. సమస్యను ఉన్నతాధికారులకు నివేదించామని వారి ఆదేశాల మేరకు అందరికీ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

## అనాథ అంత్యక్రియలకు ఆ నలుగురు

**యాడికి (తెలుగోడు), ఫిబ్రవరి 24 :**
యాడికి మండల పరిధిలోని వెంగన్న పల్లి గ్రామంలో నివాసం ఉన్న గుత్తి సూర్యనారాయణ రెడ్డి అనారోగ్యంతో మృతి చెందాడని విషయం తెలుసుకున్న యాడికి మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్ సభ్యులు అంత్యక్రియల కార్యక్రమం పూర్తి చేశారు. వివరాల మేరకు వెంగన్న పల్లి గ్రామంలో నివసిస్తున్న గుత్తి సూర్యనారాయణ రెడ్డి (70) ఆదివారం సాయంత్రం ఛాతి నొప్పితో అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రిలో చేరాడు. అయితే సూర్యనారాయణరెడ్డి అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి కుమారుడు ఉన్న ఇదివరకే మరణించడంతో అంతక్రియలు చేయడానికి ఎవరూ లేకపోవడంతో వెంగన్నపల్లి గ్రామానికి చెందిన



అంతక్రియలు నిర్వహిస్తున్న మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్ సభ్యులు



అంతక్రియలు నిర్వహిస్తున్న మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్ సభ్యులు

వ్యవసాయ సంఘం అధ్యక్షుడు జి. నాగముణి రెడ్డి యాడికి మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్ వారికి సమాచారం అందించారు. దీంతో స్పందించిన ఫౌండేషన్ సభ్యులు వెంగన్నపల్లి గ్రామానికి వెళ్లి మృతుడి అంత్యక్రియలను వారి సంప్రదాయ పద్ధతిలో పూర్తి చేశానేజ అయినవాళ్లు లేని వారికి ఆప్తమిత్రుల వలె వచ్చి అంత్యక్రియలను పూర్తి చేసినందుకు సూర్యనారాయణ రెడ్డి భార్య, గ్రామస్తులు మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్ వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్ గౌరవాధ్యక్షులు చందగాని ధ్రువ నారాయణ, సాయి వరపు నాగరాజు, కావలి సుధాకర్, బోయ అశోక్, కుమార్ పాల్గొన్నారు.

## గేట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు నైతిక విలువలపై అవగాహన

**గుత్తి (తెలుగోడు), ఫిబ్రవరి 24 :**
పట్టణ శివారులోని గేట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం విద్యార్థుల్లో నైతిక విలువలను పెంపొందించేందుకు నెల నెల విలువల బాడీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ గాయకుడు ఎస్.కె. లెనిన్ బాబు ప్రధాన వక్తగా పాల్గొన్నారు. "సంకల్పం –అంకిత భావం– కృషి" అనే అంశాలపై తన అనుభవాలను, జీవితంలో ఎదుర్కొన్న సవాళ్లను, విజయ రహస్యాలను ఆయన ఎంతో ఉత్సాహంగా పంచుకున్నారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు సంగీతాన్ని సాధనగా ఉపయోగించిన లెనిన్ బాబు ప్రదర్శన అందరినీ అలరించింది. విద్యార్థులు తమ లక్ష్యాలను స్పష్టంగా నిర్ణయించుకుని, నిరంతర సాధనతో ముందుకు సాగాలని ఆయన విద్యార్థులకు ప్రేరణనిచ్చారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ పద్మావతమ్మ, డైరెక్టర్ శ్రీవాణి, ఎండి రఘునాథరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ నమ్రత, ఏవో ఇంతియాజ్ , అధ్యాపకులు పాల్గొన్నారు




కార్యక్రమంలో మాట్లాడుతున్న లెనిన్ బాబు

## యాడికిలో కబడ్డీ పోటీలు ప్రారంభం

### సి.ఐ. శ్రీనివాసులు..

**యాడికి (తెలుగోడు), ఫిబ్రవరి 24 :**
యాడికి మండల కేంద్రంలో వెలిసిన శ్రీ శివ లక్ష్మీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా మంగళవారం ఆలయ ప్రాంగణంలో జెసి ఫ్యామిలీ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి ఓపెన్ కబడ్డీ పోటీలను యాడికి యు.పి.ఎస్. సి.ఐ.శ్రీనివాసులు ప్రారంభించారు. ఈ సందర్భంగా సి.ఐ. శ్రీనివాసులు మాట్లాడుతూ శివలక్ష్మి చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు అందరూ ఆనందంతో ఎటువంటి అల్లర్లు, గొడవలు లేకుండా ప్రశాంతంగా జరుపుకోవాలని కోరారు. రాష్ట్రస్థాయి కబడ్డీ విజేతలకు మొదటి బహుమతి దాతలు టి.డి.పి.పట్టణ అధ్యక్షుడు వెలిగండ్ల ఆదినారాయణ, టి.డి.పి. మైనారిటీ అధ్యక్షుడు సుబహాన్ , దాసరి



కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న సీఐ శ్రీనివాసులు



క్రీడాకారుల జెర్సీన్లు ఆవిష్కరిస్తున్న సీఐ శ్రీనివాసులు

రామచంద్ర, బద్దెల రాముడు, బుక్కేలక్ష్మణ్ నాయక్, 50 వేల రూపాయలు బహుమతిని అందించనున్నారు. రెండవ బహుమతి దాతలు మండల టి.డి.పి.బీ.సీ.సెల్ అధ్యక్షుడు తీరంపురం నీలకంఠ , గుండా నారాయణస్వామి, గన్నె రమేష్, వెలిగండ్ల ఉపేంద్ర, నలభై వేల రూపాయలను అందించనున్నారు. మూడవ బహుమతి దాతలు లక్ష్మీ ప్రసన్న జువెలర్స్ నీలూరు చంద్రశేఖర్ ముప్పై వేల రూపాయలు అందించనున్నారు. నాలుగవ బహుమతి దాతలు గంగవరం రవితేజ, ముత్తూట్ మనీ గోల్డ్ లోన్ యాడికి బ్రాంచ్ గంగాధర్, భాస్కర్ రెడ్డి ఇరవై వేల రూపాయలను అందించనున్నారని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కబడ్డీ క్రీడాకారులకు , పోటీలను తిలకించడానికి వచ్చిన ప్రజలకు భోజన వసతి లియో క్లబ్, విశ్వం, కండ్లపల్లి రఘు, ప్రత్యేక బహుమతులు స్టార్ పేరడైజ్ స్కూల్ యాజమాన్యం వారు అందించనున్నారు. ఈ కార్యక్రమంలో తెదేపా,జనసేన, భా.జా.పా. జె.సి. అభిమానులు, క్రీడాకారులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు



ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న అంకాళమ్మ, కుంటెమ్మ అమ్మవార్లు.

## అమ్మవార్లకు వైభవంగా శాంతి పూజలు

**పామిడి (తెలుగోడు), ఫిబ్రవరి 24 :**
పట్టణ శివారు ప్రాంతం కొండూరు రోడ్డులో వెలసిన అంకాళమ్మ, కుంటెమ్మ అమ్మవార్ల దేవాలయంలో మంగళవారం శాంతి పూజలను వైభవంగా నిర్వహించారు. పూజారి రాణి, నాగన్న, యోగి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. మండల పూజ అభిషేక అర్చనలు మహాదేవయ్య చేపట్టారు. ఉరుముల వాయిద్యాలు, డప్పుల శబ్దాల మధ్య అమ్మవార్లను ఊరేగింపు జరిపారు. పెద్దఎత్తున తరలివచ్చిన భక్తులు ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న అంకాళమ్మ, కుంటెమ్మ అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేపట్టి హారతులు ఇచ్చారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.



ఇఫ్తార్ విందుకు హాజరైన యువనేత గుమ్మనూరు ఈశ్వర్

## ఇఫ్తార్ విందులో పాల్గొన్న యువనేత గుమ్మనూరు ఈశ్వర్

**గుత్తి (తెలుగోడు), ఫిబ్రవరి 24 :**
గుత్తి పట్టణంలోనీ ఖాజా బందె నవాజ్ కట్ట వద్ద రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని ముస్లిం సోదరులకు స్థానిక టిడిపి నాయకులు చికెన్ సీను యాదవ్ ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందుకు గుంతకల్లు నియోజకవర్గం ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం తనయుడు గుత్తి యువనేత గుమ్మనూరు ఈశ్వర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. గుత్తి ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు చికెన్ శీనా యాదవ్ రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని ముస్లిం సోదరీ సోదరీమణులకు విందు ఏర్పాటు చేయడం జరిగినది. యువనేత గుమ్మనూరు ఈశ్వర్ మాట్లాడుతూ రంజాన్ పవిత్ర మైన నెలలో ముస్లిం సోదర సోదరీమణుల కు విందు ఏర్పాటు చేయడం చాలా సంతోషకరంగా ఉందని తెలియజేశారు ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి నాయకులు మహమ్మద్ షఫీ గుత్తి మండలం మరియు పట్టణ కూటమి నాయకులు కార్యకర్తలు అనుబంధ కమిటీ సభ్యులు అనుబంధ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



ఇఫ్తార్ విందుకు హాజరైన యువనేత గుమ్మనూరు ఈశ్వర్

## బెంగళూరు రోడ్డు ప్రమాదంలో రమినేపల్లి బీటెక్ విద్యార్థి మృతి

**బెళగుప్ప (తెలుగోడు), ఫిబ్రవరి 24 :**
ఒక్కగానొక్క కొడుకు బెంగళూరులో బీటెక్ చివరి సంవత్సరం చదువుతూ సోమవారం రాత్రి రోడ్డు ప్రమాదంలో బెళుగుప్ప మండలం రమినేపల్లి గ్రామానికి చెందిన మల్లి స్వామి (22) అనే యువకుడు మృతి చెందడంతో తల్లిదండ్రులతోపాటు కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది. గ్రామస్తులు అందించిన వివరాల మేరకు బెళుగుప్ప మండలం రమినేపల్లి గ్రామానికి చెందిన వెంకటేష్, రత్నమ్మ దంపతులకు ఇద్దరు కూతుర్లతో పాటు ఒక్కగానొక్క కొడుకు మల్లిస్వామి ఉన్నాడు. ఇద్దరు కూతుర్లకు పెళ్లిళ్లు చేసి పంపాడు. ఒక్కగానొక్క కొడుకు మల్లిస్వామి బెంగళూరులో బీటెక్ చివరి సంవత్సరం చదువుతుండేవాడని అయితే సోమవారం రాత్రి మరిస్వామి మరొక మిత్రుడు తో కలసి కాలేజీ నుండి తిరిగి రూముకు ద్విచక్ర వాహనంలో వస్తుండగా ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదానికి గురయ్యారని ఈ ప్రమాదంలో మల్లిస్వామి అక్కడికక్కడే మరణించగా, మిత్రుడు తీవ్ర గాయాలతో చికిత్స పొందుతూ తాను కూడా మంగళవారం సాయంత్రం మృతి చెందినట్లు తెలిసిందన్నారు. రోడ్డు ప్రమాదంలో మల్లి స్వామి మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. చేతికొచ్చిన కొడుకు రోడ్డు ప్రమాదానికి గురి కావడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల శోకసంద్రంలో మునిగిపోయారు.



మల్లిస్వామి
( ఫైల్ ఫోటో )



పరీక్షలు రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

## సజావుగా ఇంటర్ రెండవ సంవత్సరం పరీక్షలు

**అమరాపురం (తెలుగోడు), ఫిబ్రవరి 24 :** అమరాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం ఇంటర్ రెండవ సంవత్సరం పరీక్షలు సజావుగా జరిగాయి. రెండవ సంవత్సరం పరీక్షలకు 289 మంది విద్యార్థినీ విద్యార్థులు హాజరు కావలిసి ఉండగా ఒక్కరు గైరాజర్ అయినట్లు చీఫ్ సూపరింటెండెంట్ రామకృష్ణ నాయక్ పేర్కొన్నారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా విద్యార్థులకు అన్ని వసతులు కల్పించినట్లు ఆయన తెలిపారు.

## అమరాపురం గ్రంథాలయం తనిఖీ

### జిల్లా కార్యదర్శి పి.కమ్మన్న..

**అమరాపురం (తెలుగోడు), ఫిబ్రవరి 24 :** అమరాపురం గ్రంథాలయాన్ని జిల్లా కార్యదర్శి పి. కమ్మన్న తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయానికి ఎంతమంది వస్తున్నారు, లీడర్లు ఎంతమంది ఉన్నారు, పుస్తకాలు ఎన్ని ఉన్నాయి తదితర వాటిని పరిశీలించారు. రోజు పత్రికలను చదవడానికి అందుబాటులో ఉంచాలని కోరారు. అనంతరం రికార్డులను తనిఖీ చేశారు . ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది ఈ. భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



అమరాపురం గ్రంథాలయం రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా కార్యదర్శి పి.కమ్మన్న. పాల్గొన్న గ్రంథాలయ సిబ్బంది

## పేకాటరాయుళ్ల అరెస్ట్

### రూ. 4,800 నగదు స్వాధీనం..

నల్లమాడ (తెలుగోడు), ఫిబ్రవరి 24: మండల పరిధిలోని రెడ్డిపల్లి ప్రాంతంలో పేకాట ఆడుతున్న ఐదుగురిని పోలీసులు అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ. 4,800 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయాన్ని నల్లమాడ ఎస్సై సతీష్ కుమార్ వెల్లడించారు. పేకాట ఆడుతున్న సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఎస్సై సతీష్ కుమార్ ఆధ్వర్యంలో సిబ్బందితో కలిసి దాడి నిర్వహించారు. ఘటన స్థలంలో పేకాట ఆడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద ఉన్న నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అరెస్టు చేసిన వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై సతీష్ కుమార్ మాట్లాడుతూ, మండలంలో జూదం, మద్యం అక్రమ రవాణా, గంజాయి, మట్కా ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే శిక్షలు తప్పవని స్పష్టం చేశారు. మండల ప్రజలు అప్రమత్తంగా ఉండి ఎవరైనా జూదం లేదా ఇతర అక్రమ కార్యకలాపాలకు పాల్పడుతున్న సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఎస్సై తెలిపారు.



పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్న పోలీసులు

# ఆర్థిక క్రమశిక్షణతోనే కుటుంబ ప్రగతి

## రాఘువంపల్లిలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు

**బత్తలపల్లి (తెలుగోడు), ఫిబ్రవరి 24 :** ప్రతి ఒక్కరూ పొదుపును అలవాటు చేసుకుని ఆర్థిక క్రమశిక్షణ పాటించినప్పుడే కుటుంబ ప్రగతి సాధ్యమవుతుందని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ మురళి తెలిపారు. మంగళవారం రాఘువంపల్లి గ్రామంలో గ్రామీణ బ్యాంక్ బిజినెస్ కరస్పాండెంట్ కాశప్ప, వెలుగు ఆఫీసర్ ఓబులేసు అధ్యక్షతన, సీఎఫ్ఎల్ కౌన్సిలర్లు నాగభూషణ, రామకృష్ణ, వెంకటకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ మురళి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్థులు ప్రభుత్వ బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అర్హులైన వారందరూ ప్రమాద బీమా, జీవన బీమా పథకాల్లో చేరాలని సూచించారు. 10 ఏళ్లలోపు ఆడపిల్లలు ఉన్న తల్లిదండ్రులు వారి భవిష్యత్తు భద్రత కోసం సుకన్య సమృద్ధి యోజన ఖాతాలను ప్రారంభించాలన్నారు.అలాగే బ్యాంకుల్లో పేరుకుపోయిన అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్ల వివరాలు తెలుసుకుని నిబంధనల ప్రకారం క్లెయిమ్ చేసుకోవాలని సూచించారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ మురళి

ఆన్‌లైన్ మోసాలకు గురైతే వెంటనే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని, గుర్తు తెలియని వ్యక్తులకు ఓటీపీలు చెప్పరాదని హెచ్చరించారు. బ్యాంకు ద్వారా పొందిన రుణాలను దుబారా చేయకుండా, జీవనోపాధి కార్యకలాపాలకు మాత్రమే వినియోగించి ఆర్థికంగా ఎదగాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో వెలుగు సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు,గ్రామస్థులు పాల్గొన్నారు.

# రబీ సాగు నమోదు గడువు నేటితో ముగింపు

## రైతన్నలు వెంటనే నమోదు చేసుకుని ప్రయోజనాలు పొందాలి.. మండల వ్యవసాయ అధికారి అబ్దుల్ హాక్..

**నల్లమాడ (తెలుగోడు), ఫిబ్రవరి 24 :** రబీ సీజన్‌కు సంబంధించిన పంట నమోదు గడువు బుధవారంతో ముగియనుందని మండల వ్యవసాయ అధికారి అబ్దుల్ హాక్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ రబీ సాగును ఈ క్రాప్ బుకింగ్ ద్వారా నమోదు చేసుకోవడం రైతులకు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. ఇంకా పంట నమోదు చేయని రైతన్నలు వెంటనే సంబంధిత రైతు సేవా కేంద్రాన్ని సంప్రదించి తమ పంట వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ క్రాప్ బుకింగ్ ద్వారా రైతులకు పంటలపై ప్రభుత్వ గుర్తింపు లభిస్తుందని, ప్రకృతి వైపరీత్యాలు సంభవించిన సందర్భంలో నష్టపరిహారం అందే అవకాశాలు మెరుగవుతాయని ఆయన వివరించారు. సాగు ఆధారంగా పలు ప్రభుత్వ పథకాల అమలు, విత్తనాలు, ఎరువుల సరఫరా, రాయితీలు అందించడంలో ఈ నమోదు కీలకంగా ఉంటుందని తెలిపారు. పంటల గణాంకాలు సక్రమంగా నమోదైతేనే భవిష్యత్‌లో రైతులకు అవసరమైన సాయం త్వరితగతిన అందుతుందని స్పష్టం చేశారు. మండలంలో రైతు గుర్తింపు సంఖ్య నమోదు ప్రక్రియలో ఇంకా 1063 మంది రైతులు పూర్తి చేయలేదని వెల్లడించారు. వారి వివరాలను



మండల వ్యవసాయ అధికారి అబ్దుల్ హాక్

సంబంధిత సచివాలయాలు, రైతు సేవా కేంద్రాల్లో ఉంచినట్లు తెలిపారు. నమోదు చేయని రైతులు తమ ఆధార్ కార్డు, ఆధార్‌కు అనుసంధానమైన ఫోన్, తాజా ఒకటి బి పత్రంతో రైతు సేవా కేంద్రానికి వెళ్లి వెంటనే గుర్తింపు సంఖ్య పూర్తి చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రతి వ్యవసాయ పథకం సక్రమంగా పొందాలంటే సాగు నమోదు, రైతు గుర్తింపు సంఖ్య తప్పనిసరి అని అబ్దుల్ హాక్ తెలిపారు. గడువు ముగిసేలోపు నమోదు పూర్తి చేసి ప్రభుత్వ సేవలను వినియోగించుకోవాలని రైతన్నలను కోరారు.

# సేంద్రియ సాగుతో మేలైన దిగుబడులు

## ధర్మవరం వ్యవసాయ సహాయ సంచాలకులు లక్ష్మా నాయక్..

**బత్తలపల్లి (తెలుగోడు), ఫిబ్రవరి 24 :** రైతులు ఉత్తమ వ్యవసాయ యాజమాన్య పద్ధతులను పాటించడం ద్వారా నాణ్యమైన దిగుబడులు సాధించి అధిక ఆదాయం పొందవచ్చని ధర్మవరం వ్యవసాయ సహాయ సంచాలకులు లక్ష్మానాయక్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని బత్తలపల్లి గ్రామంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సేంద్రీయ ఉత్పత్తుల ధ్రువీకరణ సంస్థ ఆధ్వర్యంలో నమోదు అయిన రైతుల పొలాలను ఆయన సంబంధిత అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా శ్రీ సత్యసాయి జిల్లా సేంద్రీయ ధ్రువీకరణ సంస్థ మూల్యాంకన అధికారి బి.వెంకటేష్ రైతన్నలతో మాట్లాడుతూ..పురుగుమందులు, రసాయన ఎరువులను వ్యవసాయ అధికారుల సూచనల మేరకు మాత్రమే వినియోగించాలని,అధిక మోతాదులో వాడటం వల్ల పంటల్లో రసాయన అవశేషాలు మిగిలి, మానవ ఆరోగ్యం పైన ప్రభావం చూపుతుందని తెలియజేశారు.సేంద్రీయ సాగు, ఉత్తమ వ్యవసాయ యాజమాన్య పద్ధతులతో పండించిన పంటలకు ఇండియా గుడ్ అగ్రికల్చరల్ ప్రాక్టీసెస్ వంటి ధ్రువీకరణలు పొందితే



పంటలను పరిశీలిస్తున్న ఏడీఏ లక్ష్మనాయక్

మార్కెట్‌లో మంచి ధర లభిస్తుందని, దీంతో రైతులకు ఆర్థికంగా మేలు జరుగుతుందని తెలిపారు.రసాయన రహిత సాగు ద్వారా భూసారాన్ని కాపాడడమే కాకుండా సమాజానికి విషరహితమైన, ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందించవచ్చని వివరించారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఓబిరెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీనివాస్‌తో పాటు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# గణపతి విగ్రహం చోరులను కఠినంగా శిక్షించాలి

## భక్తులు, గ్రామపెద్దలతో సమావేశం.. డిఎస్‌పి నర్సింగప్ప, సిఐ రాజ్ కుమార్..

**అగళి (తెలుగోడు), ఫిబ్రవరి 24 :** అగళి పోలీస్ స్టేషన్లో డిఎస్పి నర్సింగప్ప, మడకశిర సిఐ రాజకుమార్ ఆధ్వర్యంలో స్థానిక గ్రామ పెద్దలు , భక్తులతో మంగళవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు డిఎస్పితో మాట్లాడుతూ అగళిలోని చోళ రాజుల కాలం నాటి పురాతన శంకరేశ్వర స్వామి దేవాలయంలో నిధి నిక్షేపాలు అధికంగా ఉన్నాయని పసిగట్టిన గుప్త నిధుల వేటగాళ్ళు గత నాలుగు నెలల క్రితం ఆలయంలో ఉన్న సుమారు 400 కిలోల బరువు గల గణపతి విగ్రహాన్ని తీసుకెళ్లారని, అప్పుడే పోలీస్ స్టేషన్లో కూడా ఫిర్యాదు చేయడం జరిగిందని,కానీ ఇప్పటివరకు ఆచూకీ



పాల్గొన్న గణపతి భక్తులు గ్రామపెద్దలు



మాట్లాడుతున్న డిఎస్పి నర్సింగప్ప


తెలియలేదని వేగంగా గాలింపు చేపట్టి విగ్రహాన్ని తీసుకువచ్చి న్యాయం చేయాలని అదేవిధంగా విగ్రహాన్ని దొంగలించిన దొంగల ముఠాను వెంటనే పట్టుకొని కఠినంగా శిక్షించాలన్నారు. ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని డి.ఎస్.పి కి విన్నవించారు. గతంలో కూడా శంకరేశ్వర స్వామి దేవాలయ ప్రాంగణము నందు కూడాకొంతమంది గుర్తుతెలియని వ్యక్తులు గుప్త నిధుల కోసం తవ్వకాలు జరుపుతుండగా అకస్మాత్తుగా పాము ప్రత్యక్షమైందని దీనిని చూసిన గుప్త నిధులత్రవ్వకం దారులు అక్కడ నుంచి భయపడి వెనుతిరిగినట్లు తెలిసిందన్నారు. విషయాలను విన్న డి.ఎస్.పి స్పందిస్తూ పబ్లిసిటీ చేసుకుంటే దొంగలు తొందరగా దొరకరని, దొంగతనం చేసిన ముద్దాయిలను కొనుగోలు చేసిన వారు రక్షించడానికి ఆస్కారం ఉంటుందన్నారు. అందుకే సంయమనం పాటించాలని అన్నారు.కేసు దర్యాప్తు జరుగుతోందని దొంగలను తప్పకుండా పట్టుకుంటామని వదిలే ప్రసక్తి లేదన్నారు

# శ్రీ ఆంజనేయ స్వామి ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి రామేగౌడ్ మృతి



రామేగౌడ్ మృతదేహానికి పూలమాలలు నివాళులర్పిస్తున్న మండల్ కన్వీనర్ కృష్ణమూర్తి వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు గణేష్ మాజీ జెడ్పీటీసి నరసింహ మూర్తి

**అమరాపురం (తెలుగోడు), ఫిబ్రవరి 24 :** మండల పరిధిలోని తమ్మడే పల్లి శ్రీ ఆంజనేయస్వామి దేవాలయం ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి, దేవగానపల్లి, నాగమ్మ, మద్దెమ్మ దేవాలయం రామేగౌడ్ మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ కృష్ణమూర్తి, సహకార సంఘం అధ్యక్షులు గణేష్, మాజీ జెడ్పీటిసి నరసింహమూర్తి , టి ఎన్ టి యు సి మంజునాథ్, మాజీ సర్పంచ్ చంద్రశేఖర్ రామే గౌడ్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకర్ రెడ్డి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షులు హలకూరు కాంతరాజు, మండల కన్వీనర్ త్రిలోక్నాథ్, నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఉప్పర్లపల్లి శివన్న తమ్మడేపల్లి సర్పంచ్ గిరిజమ్మ సదానంద గౌడ్, అమరాపురం ఎంపిటిసి నాగభూషణ్, హలకూరు సురేష్ రామేగౌడ్ మృత దేహంపై పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.





రామేగౌడ్ భౌతిక కాయానికి పూలమాలలు నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకర్ రెడ్డి, హల్కూర్ కాంతరాజు, సర్పంచ్ సదానంద గౌడ్



అమ్మవార్లకు పూలతో అలంకరించిన దృశ్యం

## ఘనంగా అమ్మవార్ల జాతర మహోత్సవం

గుడిబండ, (తెలుగోడు), ఫిబ్రవరి 24: మండల పరిధిలోని జంబులబండ, కేకాతి, రామయ్య న హోట్టి, కేడి పాళ్యం, హెచ్ ఆర్ హోట్టి తదితర గ్రామంలో మంగళవారం కొల్లాపూర మహాలక్ష్మి, కరియమ్మ, మారమ్మ దేవిల అమ్మవార్ల జాతర మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామంలో అమ్మవార్లకు అర్చకులు రంగురంగు పూలతో అలంకరించి కుంకుమార్చన, పూలార్చన, తదితర నైవేద్యాలు నిర్వహించారు.మహిళలు పెద్ద ఎత్తున బియ్యం పిండితో తయారుచేసిన జ్యోతులను తీసుకుని ఊరేగింపుగా వెళ్లి అమ్మవార్లకు సమర్పించారు. ఆయా గ్రామాల్లో వేలాది మంది భక్తులు పాల్గొని అమ్మవార్లకు మొక్కుబడులు తెచ్చుకున్నారు. అనంతరం బంధుమిత్రులకు విందు భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్ మూర్తి, తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ లక్ష్మీ నరసప్ప, సింగల్ విండో అధ్యక్షుడు మద్దనకుంటప్ప, జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడు రాధాకృష్ణ నాయకులు శ్రీనాథ్ వెంకటేష్ షబ్బీర్ దుర్గేష్, శశిధర్ తదితరులు పాల్గొన్నారు.



అక్షరాంధ్ర కేంద్రంలో అభ్యాసకులకు సూచనలు ఇస్తున్న అధికారులు

## అక్షరాంధ్ర కేంద్రం సందర్శన

**నల్లమాడ (తెలుగోడు), ఫిబ్రవరి 24 :** నల్లమాడ మండలం వంకరకుంట గ్రామంలోని అక్షరాంధ్ర కేంద్రాన్ని అధికారులు మంగళవారం సందర్శించారు. ఈ కార్యక్రమంలో అక్షరాంధ్ర సూపర్వైజర్ సుధాకర్, ఏపీఎం గోపాల్, డిప్యూటీ ఎంపీడీవో హాజీ వలి, సీసీ శ్రీనివాసులు, వాలంటీర్లు లర్నర్స్ పాల్గొన్నారు. కేంద్రంలో నిర్వహిస్తున్న బోధన విధానం, హాజరు నమోదు, అభ్యాసకుల ప్రగతి వంటి అంశాలను అధికారులు పరిశీలించారు. లర్నర్స్‌తో మాట్లాడి వారి అభ్యాస స్థాయిని తెలుసుకున్నారు. కార్యక్రమం అమలు తీరుపై సూపర్వైజర్ సుధాకర్ పలు సూచనలు చేశారు.

ఈ సందర్భంగా డిప్యూటీ ఎంపీడీవో హాజీ వలి మాట్లాడుతూ, అక్షరాంధ్ర కార్యక్రమం గ్రామీణ ప్రాంతాల్లో నిరక్షరాస్యత నిర్మూలనకు ఎంతో కీలకమని అన్నారు. చదువు అందని పెద్దలను అక్షరాస్యులుగా మార్చడం ద్వారా వారి జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని తెలిపారు. ప్రభుత్వ పథకాలు, బ్యాంకింగ్ సేవలు, ఆరోగ్య సమాచారం వంటి అంశాలను సులభంగా అర్థం చేసుకునేందుకు అక్షరాస్యత అవసరమని వివరించారు.

ప్రతి ఒక్కరూ అక్షరాంధ్ర కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని చదువు నేర్చుకోవాలని, వాలంటీర్లు బాధ్యతగా వ్యవహరించి మరింత మందిని కార్యక్రమంలో చేర్చాలని హాజీ వలి పిలుపునిచ్చారు. అధికారులు కేంద్ర నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేస్తూ, మరింత మెరుగైన ఫలితాలు సాధించాలని సూచించారు.




సమావేశంలో పాల్గొన్న అధికారులు

## బుచ్చి పీహెచ్సీలో స్టిగ్మా రిడక్షన్ కార్యక్రమం

**బుచ్చిరెడ్డిపాలెం (తెలుగోడు), ఫిబ్రవరి 24 :** బుచ్చి పిహెచ్సి చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్స్ స్కీమ్ అధ్వర్యంలో బుచ్చిరెడ్డిపాలెం ఏరియా హాస్పిటల్ లో మంగళవారం స్టిగ్మా రిడక్షన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ షేక్.ఖాదర్ వలి, డాక్టర్ జి.పద్మజ, డిస్ట్రిక్ టీం యం అండ్ ఇ ఆఫీసర్ డ్యాప్కు కె.శివ, శాస్ స్టేట్ టీం ఆఫీసర్ యస్.పి.ఓ బాబు, సి.యఫ్.ఐ అండ్ పి.ఓ స్టేట్ ఆఫీసర్ యస్.శ్రీనివాసులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హెచ్.ఐ.వితో జీవిస్తునవారు సరైన పోషక ఆహారం తీసుకోవడం ద్వారా అవకాశవాద రోగాలు రాకుండా చూసుకోవచ్చునన్నారు. హెచ్ఐవి సోకిన వారి పట్ల వివక్ష, అసమానతలు గ్రామాల్లో ఎక్కువగా ఉంటాయని, అలాంటి అసమానతలు ఉండకుండా కౌన్సెలింగ్ ఇవ్వాలి అని అన్నారు. మెడిటేషన్, ఆత్మా స్థైర్యంతో బతకాలన్నారు. పోషక పదార్థాలకు సంబంధించి ఆహార ధాన్యాలు ఎనిమిది రకాలు అందించారు. హెచ్ఐవి వచ్చిన వ్యక్తి చనిపోడని, హెచ్ఐవి లింకు వ్యాధులు సోకడం వల్ల మాత్రమే చనిపోతారన్నారు. కుటుంబసభ్యులకు పాజిటివ్ వస్తే చికిత్స తీసుకోవడం ద్వారా జీవితాన్ని పెంచుకోవచ్చున్నారు. ఎయిడ్స్ బాధితులు 20 మందికి డాక్టర్ జి.పద్మజ, షేక్.ఖాదర్ వలి ఆహార ధాన్యాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జి.పద్మజ, డాక్టర్ షేక్.ఖాదర్ వలి, చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్స్ స్కీమ్ డి.ఆఫ్.పి. సురేఖ, చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ జె.ఐతాంబ, ల్యాబ్ టెక్నిషియన్ రవితేజ, శారద, టి.బి.ల్యాబ్ టెక్నిషియన్ నీలిమ తదితరులు పాల్గొన్నారు.




అవగాహన కల్పిస్తున్న అధికారులు



ఎస్ఐ నిరంజన్ రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

## దళిత సంఘం నాయకులకు రక్షణ కల్పించాలి

ఎస్ఐకు వినతిపత్రం.. ఎమ్మార్పీఎస్ నాయకులు..

**పెద్దకడబూరు (తెలుగోడు), ఫిబ్రవరి 24 :**
పెద్దకడబూరు మండలంలో దళితులపై జరుగుతున్న దాడులు, అఘాయిత్యాల నేపథ్యంలో దళితులకు మరియు దళిత సంఘం నాయకులకు రక్షణ కల్పించాలని ఏపీ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం పెద్దకడబూరులోని పోలీసు స్టేషన్ లో ఎస్ఐ నిరంజన్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏపీ ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు ఆశీర్వాదం, మండల కార్యదర్శి సుమల రాజేష్ మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా మండల వ్యాప్తంగా దళితులపై దాడులు, హత్యలు, అత్యాచారాలు, మానభంగాలు వంటి సంఘటనలు చోటుచేసుకుంటున్నాయని పేర్కొన్నారు. ఈ పరిణామాల వలన దళితుల మానప్రాణాలకు ముప్పు ఏర్పడిందన్నారు. కల్లుకుంట గ్రామంలో దళిత మహిళపై అవమానకర ఘటనలు, ఎస్సీ కాలనీపైన దాడులు, అంబేద్కర్ విగ్రహంపై దురుద్దేశపూర్వక చర్యలు చోటుచేసుకున్నాయని ఆరోపించారు. అలాగే చిన్నతుంబలం గ్రామంలో మాదిగలపై దాడులు జరిగినట్లు తెలిపారు. ఈ సంఘటనలను ఏపీ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో తీవ్రంగా ఖండిస్తున్నామని, ప్రభుత్వం మరియు పోలీసు వ్యవస్థ న్యాయం వైపు నిలబడి దళితులకు తగిన రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రాణహాని ముప్పు ఉన్న దళిత సంఘం నాయకుల విషయమై సమగ్ర విచారణ జరిపి, అవసరమైతే లైసెన్స్ గన్ మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

## ఉరుకుంద ఆలయ ట్రస్ట్ డైరెక్టర్‌గా జిలకర సావిత్రి నియామకం

**పెద్దకడబూరు (తెలుగోడు), ఫిబ్రవరి 24 :**
కౌతాళం మండల పరిధిలోని ఉరుకుంద గ్రామంలో వెలసిన శ్రీ నరసింహ ఈరన్నస్వామి ఆలయ ట్రస్ట్ డైరెక్టర్ గా పెద్దకడబూరు గ్రామానికి చెందిన జనసేన పార్టీ మండల నాయకులు జిలకర గణేష్ తల్లి జిలకర సావిత్రి నియమితులయ్యారు. ఇందుకు సంబంధించిన అధికారిక ఉత్తర్వులను ప్రభుత్వం విడుదల చేసింది. జనసేన పార్టీ తరఫున ఈ నియామకం జరగడం పట్ల పెద్దకడబూరు మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ నాయకులు జిలకర గణేష్ మాట్లాడుతూ తమ కుటుంబంపై నమ్మకం ఉంచి ఈ అవకాశం కల్పించిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రాలయం టీడీపీ ఇన్ చార్జ్ రాఘవేంద్ర రెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. దేవస్థానం అభివృద్ధి, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనలో తన తల్లి నిబద్ధతతో పనిచేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. జిలకర సావిత్రి నియామకం దేవస్థానం పరిపాలనలో పారదర్శకత, అభివృద్ధి కార్యక్రమాలకు ఊతమివ్వనుందని అభిప్రాయపడ్డారు. భక్తుల సౌకర్యాల విస్తరణ, దేవాలయ అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతం కావాలని ఆకాంక్షించారు.



ఉరుకుంద ఆలయ ట్రస్ట్ డైరెక్టర్‌గా ఎంపికైన జిలకర సావిత్రి

## 26న జంపాపురంలో శ్రీ బసవేశ్వరస్వామి రథోత్సవం

**కోసిగి (తెలుగోడు), ఫిబ్రవరి 24 :**
కోసిగి మండలం పరిధిలోని జంపాపురం గ్రామంలో వెలసిన కొలిచేవారికి కొంగు బంగారమై శ్రీ బసవేశ్వర స్వామి రథోత్సవం గురువారం నాడు కన్నులపండుగగా జరిగనున్నది. ఈ సందర్భంగా గ్రామంలో వెలసిన బసవేశ్వరస్వామి ఆలయమును రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. స్వామి వారికి సైతం ప్రత్యేక అలంకరణ చేశారు. ఉదయంనుండే గ్రామ ప్రజలే కాకుండా కర్ణాటక, తోపాటు ఇతర ప్రాంతాలనుండి పెద్ద ఎత్తున భక్తులు హాజరై స్వామి వారికి మొక్కులు తీర్చుకుకుంటారు.. సాయంత్రం వేలాది మంది హర్షధ్వనుల మధ్య స్వామి వారి రథం ను స్వామి వారి సన్నిధి వరకు లాగి యాదస్తానంలో ఉంచుతారు.. రథోత్సవానికి కూటమి నాయకులు మంత్రాలయం నియోజకవర్గం ఇంచార్జ్ రాఘవేంద్రారెడ్డి, సోదరుడు రామకృష్ణ రెడ్డి, సాగునీటి సంఘం మండల అధ్యక్షుడు ఆనంతసేనరెడ్డి, కుబేరరెడ్డి ,టీడీపీ మండల నాయకులు వైసీపీ నుండి ప్రదీప్ రెడ్డి, మురళీమోహన్ రెడ్డి ఎంపిపి ఈ రన్న ,బసిరెడ్డి లు హాజరవుతున్నట్లు తెలిసింది .ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సిఐ మంజునాథ్ ఆధ్వర్యంలో ఎస్సై రమేష్ రెడ్డి తన సిబ్బందితో గట్టిపోలీస్ బందోబస్తు నిర్వహింస్తూ నట్లు తెలిపారు.



దేవాలయంలో వెలసిన శ్రీ బసవేశ్వర స్వామి

## ఆనాపానా సతి ధ్యాన సాధన

**అనంతపురం రూరల్ (తెలుగోడు), ఫిబ్రవరి 24 :**
అనంతపురం నగరంలోని "రాధా స్కూల్ ఆఫ్ లెర్నింగ్ " పాఠశాలలో భంతే సిద్ధా రక్షిత ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆనాపానా సతి ధ్యానం సాధన చేయించారు. పాఠశాలలో 9, 10వ తరగతి పబ్లిక్ పరీక్షల సందర్భంగా భంతే సిద్ధా రక్షిత ధ్యానం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. పంచశీలాల గురించి వివరిస్తూ ధ్యానం నేర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండెంట్ శ్రీమతి శ్రీదేవి, జయచంద్ర, శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఆనందరాజు, న్యాయవాది హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



రాధా స్కూల్ ఆఫ్ లెర్నింగ్ పాఠశాల విద్యార్థులకు ఆనాపానా సతి ధ్యాన సాధన చేపిస్తున్న భంతే సిద్ధా రక్షిత

## కూటమి ప్రభుత్వంతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యం

### సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ .. టీడీపీ రైతు విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంతరెడ్డి..

**పెద్దకడబూరు (తెలుగోడు), ఫిబ్రవరి 24 :**
గ్రామాల సమగ్ర అభివృద్ధి కూటమి ప్రభుత్వంలోనే సాధ్యమని టీడీపీ రైతు విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంతరెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం పెద్దకడబూరు గ్రామంలోని కురవ వీధిలో ఉపాధి హామీ పథకం కింద రూ. 5 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణానికి టీడీపీ రైతు విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంతరెడ్డి, సొసైటీ చైర్మన్ మీ సేవ ఆంజనేయులు, టీడీపీ బీసీ సాధికార రాష్ట్ర కమిటీ సభ్యులు మల్లికార్జున భూమిపూజ చేసి పనులు



కురువవీధిలో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేసి పనులు ప్రారంభించిన టీడీపీ నాయకులు

ప్రారంభించారు. ఈ సందర్భంగా రమాకాంతరెడ్డి మాట్లాడుతూ కేటీ శివన్న ఇంటి దగ్గర నుంచి ఆర్అండ్ బీ రోడ్డు వరకు సీసీ రోడ్డు నిర్మిస్తామన్నారు. ఉపాధి హామీ పథకం 3.0 కింద పెద్దకడబూరు మండలానికి 1.90 కోట్ల రూపాయలు మంజూరయ్యాయని పేర్కొన్నారు. గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. గతంలో వైఎస్ జగన్మోహన్ రెడ్డి హయాంలో సీసీ, బీటీ లేదా మట్టిరోడ్ల నిర్మాణం జరగలేదని విమర్శించారు. అభివృద్ధి గురించి మాట్లాడే నైతిక హక్కు వైసీపీ నాయకులకు లేదన్నారు. "అభివృద్ధి అంటే కూటమి, కూటమి అంటే అభివృద్ధి" అని వ్యాఖ్యానించారు. సంక్షేమం – అభివృద్ధి రెండింటినీ సమపాళ్లలో అమలు చేస్తున్నామని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నరసింహులు, సిద్దార్థ, బొగ్గుల నరసన్న, సుధాకర్, దేవసహాయం, డీలర్లు గుమ్మల ఆశన్న, ఆదాము, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.



కురువవీధిలో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేసి పనులు ప్రారంభించిన టీడీపీ నాయకులు

## రేపు కోసిగిలో శ్రీశ్రీశ్రీ గురుసుబ్బారూఢ స్వామి రథోత్సవం

**కోసిగి (తెలుగోడు), ఫిబ్రవరి 24 :**
కోసిగిలోని రంగప్ప కొండ వద్ద వెలసిన శ్రీశ్రీశ్రీ గురుసుబ్బరూఢ స్వామి 63వ రథోత్సవం గురువారం నాడు కన్నుల పండుగగా జరుగనుంది. జాతరకు వేలాదిగా భక్తులు తరలి రానున్నారు.. ఈ సందర్భంగా ఉదయం నుండే భక్తులు బారులు తీరి స్వామి వారికి మొక్కులు చెల్లించుకుంటారు.. అలాగే ఆలయంలో వెలసిన శ్రీ మల్లికార్జున స్వామి కి శ్రీశ్రీశ్రీ గురుసుబ్బరుడా స్వామికి పంచా మృతాభిషేకం తోపాటు ప్రత్యేక పూజలు నిర్వహింస్తారు. సాయంత్రం వేళల్లో పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్త జన హర్షధ్వనుల మధ్య స్వామి వారి రథమును స్వామి వారి సన్నిధి వరకు లాగి యదస్తానంలో ఉంచుతారు... రథోత్సవ కార్యక్రమం దేవాలయం కార్యదర్శులు మఠం చంద్రయ్య, బొంబాయి దయా ఆధ్వర్యంలో మరియు బొంబాయి దయా వారి కుటింబికుల ఆధ్వర్యంలో జరుగుతుంది. అలాగే బొంబాయి దయా వారి తల్లిదండ్రులకు కోసిగిలో కట్టిన దేవాలయంలో సైతం భారీ గా పూజలు నిర్వహించారు.. రథోత్సవం అనంతరం రాత్రి కూడా భజన కార్యక్రమం నిర్వహిస్తారు.. రథోత్సవం లో గోరువైయల నృత్యాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకుంటాయి.. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఎస్సై రమేష్ రెడ్డి ఆధ్వర్యంలో



కోసిగిలో వెలసిన శ్రీశ్రీశ్రీ గురు సుబ్బా రూఢ స్వామి

గట్టి పోలీస్ బందోబస్తు నిర్వహింస్తున్నట్లు తెలిపారు. రథోత్సవం కు వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాల తోపాటు అన్నదాన కార్యక్రమం కూడా ఏర్పాటు చేసినట్లు మఠం నిర్వాహకులు బొంబాయి దయా చంద్రయ్య తదితరులు తెలిపారు.

## రెండవ రోజు అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ రిలే నిరాహార దీక్షలు

**ఎమ్మిగనూరు (తెలుగోడు), ఫిబ్రవరి 24 :**
ఎమ్మిగనూరు స్థానిక తహసిల్దార్ ఆవరణలో సీఐటీయు ఆధ్వర్యంలో అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ రిలే నిరాహార దీక్షలు మంగళవారం రెండవ రోజు కొనసాగాయి. ఈ సందర్భంగా యూనియన్ నాయకురాలు గోవర్ధనమ్మ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో 42 రోజుల సమ్మె చేయడంతో,



దీక్షల్లో పాల్గొన్న అంగన్‌వాడీలు



అంగన్‌వాడీల దీక్షకు మద్దతు తెలిపిన సిఐటియు నాయకులు

అప్పటి ప్రతిపక్షంగా ఉన్న, ఇప్పటి కూటమి ప్రభుత్వం మా శిబిరాల దగ్గరకు వచ్చి, మీ న్యాయమైన డిమాండ్స్ నా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నెరవేరుస్తామని హామీ ఇవ్వడం జరిగింది. అంతే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు కావస్తున్నా డిమాండ్స్‌ని పట్టించుకోవడం లేదంటూ విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం కనీస వేతనం 26 వేల రూపాయలు, మే నెలలో వేసవి సెలవుల జీవో ఇవ్వాలని, ప్రతి డిమాండ్ నెరవేర్చాలని ప్రభుత్వాన్ని కోరారు.

## హోరాహోరీగా మండల స్థాయి గిరిక పోటీలు

### విజేతలకు బహుమతులు అందజేసిన పీఠాధిపతులు ..

**పెద్దకడబూరు (తెలుగోడు), ఫిబ్రవరి 24 :**
పెద్దకడబూరు మండల పరిధిలోని బాపురం గ్రామంలో వెలసిన శ్రీ గంగాదేవి రథోత్సవం సందర్భంగా మంగళవారం మండల స్థాయి గిరిక పోటీలను పీఠాధిపతులు శ్రీ బసలింగమ్మ అవ్వ అట్టహాసంగా ప్రారంభించారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి మొత్తం 10 జతల కాడెద్దులు గిరిక పోటీలలో పాల్గొన్నాయి. హోరాహోరీగా జరిగిన పోటీలలో కంబళదిన్నె గ్రామానికి చెందిన గజ్జల ఉసేని కాడెద్దులు నిర్ణీత సమయంలో 3768 అడుగులు లాగి ప్రథమ స్థానంలో నిలిచాయి. హనుమాపురం గ్రామానికి చెందిన గోవిందప్ప కాడెద్దులు 3600 అడుగులు లాగి ద్వితీయ స్థానంలో నిలువగా, చిన్నకడబూరు గ్రామానికి చెందిన నాగేష్ కాడెద్దులు 3526 అడుగులతో తృతీయ స్థానం, ఇదే గ్రామానికి చెందిన పెద్ద లక్ష్మన్న కాడెద్దులు 3381 అడుగులతో నాల్గవ స్థానంలో నిలిచాయి. గిరిక పోటీలలో విజేతలుగా నిలిచిన కాడెద్దుల యజమానులకు పీఠాధిపతులు శ్రీ బసలింగమ్మ అవ్వ చేతుల మీదుగా ప్రథమ బహుమతిగా రూ. 16,116 చిన్న కొలప్ప, చిన్న వీరేష్, చిన్న లింగప్ప, లక్ష్మన్న తరుపున అందజేశారు. ద్వితీయ బహుమతిగా రూ. 10,116 ఆలయ కమిటీ పెద్దల తరుపున, తృతీయ బహుమతిగా రూ. 5,116 కంబళదిన్నె చాకలి నాగరాజు తరుపున, నాల్గవ బహుమతిగా రూ. 3,116 బోయ తిక్కయ్య తరుపున అందజేశారు. శ్రీ గంగాదేవి రథోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన గిరిక పోటీలు విజయవంతం కావడంపై సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో చిన్నతుంబళం, బాపురం గ్రామాల ఆలయ కమిటీ సభ్యులు, పెద్దలు పాల్గొన్నారు.



బాపురంలో హోరాహోరీగా జరుగుతున్న గిరిక పోటీలు

## నరసాపురం వెల్ఫేర్ అసిస్టెంట్ కార్తీక్ కుమార్‌పై వేటు..

**బెళగుప్ప (తెలుగోడు), ఫిబ్రవరి 24 :**
ప్రభుత్వం పేదలకు ప్రతి నెల అందించే ఎన్టీఆర్ భరోసా పింఛన్ల డబ్బును పంపిణీ అనంతరం మిగిలిన 96 వేల రూపాయలను సకాలంలో ఉన్నతాధికారులకు తిరిగి చెల్లించనందుకు విధులలో నిర్లక్ష్యం వహించినందుకు చర్యగా బెళుగుప్ప మండలం నరసాపురం గ్రామ సచివాలయానికి చెందిన వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషనల్ అసిస్టెంట్ కార్తీక్ కుమార్ ను సస్పెండ్ చేసినట్లు ఎంపీడీవో లక్ష్మీనారాయణ, సచివాలయాల ఎంపీడీవో ఏకాంబరేశ్వరయ్య పేర్కొన్నారు. బెళుగుప్ప మండలంలోని నరసాపురం గ్రామ సచివాలయం లో వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషనల్ అసిస్టెంట్ గా విధులు నిర్వహిస్తున్న కార్తీక్ కుమార్ ప్రతినెల పేదలకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేసేవాడు. అయితే గత సెప్టెంబర్ నుంచి డిసెంబర్ వరకు పింఛన్ల పంపిణీ అనంతరం మిగిలిన 96 వేలరూపాయలను సంబంధిత ఉన్నతాధికారులకు తిరిగి చెల్లించాలి . అయితే వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషనల్ అసిస్టెంట్ కార్తీక్ కుమార్ ఆ డబ్బును తిరిగి చెల్లించకుండా విధులలో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు సంబంధిత జిల్లా ఉన్నతాధికారులు వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషనల్ అసిస్టెంట్ కార్తీక్ కుమార్ ను సస్పెండ్ చేసినట్లు ఎంపీడీవో లక్ష్మీనారాయణ, సచివాలయాల ఎంపీడీవో ఏకాంబరేశ్వరయ్య తెలిపారు.



ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాన్ని సందర్శించిన ఎస్సై రమేష్ రెడ్డి

## పరీక్ష కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన బందోబస్తు

ఎస్సై రమేష్ రెడ్డి ..

**కోసిగి (తెలుగోడు), ఫిబ్రవరి 24 :**
కోసిగిలో రెండు సెంటర్లలో జరుగుతున్న ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు ఎస్సై రమేష్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షలు ప్రశాంతంగా, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా సజావుగా నిర్వహించేలా అవసరమైన బందోబస్తు ఏర్పాటు చేశామని తెలిపారు. పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాలలో పోలీస్ సిబ్బందిని నియమించి భద్రతా చర్యలు చేపట్టడమే కాకుండా, కేంద్రాల సమీపంలోని జిరాక్స్ కేంద్రాలను కూడా ప్రత్యేకంగా తనిఖీ చేశామన్నారు. అనుమానాస్పదంగా ప్రశ్నాపత్రాల నకళ్లు లేదా ఇతర అనుచిత చర్యలు జరగకుండా కట్టుదిట్టమైన నిఘా ఏర్పాటు చేశామన్నారు. ప్రజలు, తల్లిదండ్రులు, జిరాక్స్ దుకాణాల యజమానులు పోలీస్ శాఖకు సహకరించి పరీక్షలు పారదర్శకంగా , విజయవంతంగా పూర్తయ్యేలా సహకరించాలని కోరారు.



టూ వీలర్ బైక్ మెకానిక్‌ల యూనియన్ సభ్యులు

## టూ వీలర్ బైక్ మెకానిక్‌ల యూనియన్ ఏర్పాటు

**కోసిగి (తెలుగోడు), ఫిబ్రవరి 24 :**
కోసిగి మండలంలో పనిచేస్తున్న టూ వీలర్ బైక్ మెకానిక్‌లు మంగళవారం కొత్త యూనియన్ ఏర్పాటు చేసుకున్నారు. ఈ యూనియన్లో మొత్తం 50 మంది ఉన్నట్లు తెలిపారు. టూ వీలర్ బైక్ మెకానిక్‌ల యూనియన్ ప్రెసిడెంట్‌గా జేరుబండి. శ్రీనివాసులు , వైస్ ప్రెసిడెంట్‌గా ఈ. వీరేష్ , సెక్రటరీగా కే. బషీర్, జాయింట్ సెక్రటరీగా కే. మహేష్ , ట్రెజరర్‌గా యు. నాగరాజు ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన బైక్ మెకానిక్ లు ఎస్సై రమేష్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువా పూలమాలతో సత్కరించారు.



ముస్లిం మైనారిటీల శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

## ముస్లిం మైనారిటీల శ్మశాన వాటికకు స్థలం కేటాయించండి

**పెద్దకడబూరు (తెలుగోడు), ఫిబ్రవరి 24 :**
పెద్దకడబూరు మండల పరిధిలోని మేకడోణ గ్రామం: మేకడోణ గ్రామంలోని ముస్లిం మైనారిటీలకు శ్మశాన వాటిక కోసం తగిన స్థలం కేటాయించాలని ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ తాలూకా అధ్యక్షులు జాఫర్ పటేల్, మండల నాయకులు ఉసేన్ బాషా మాట్లాడుతూ గ్రామంలో శ్మశానవాటికకు సరియైన స్థలం లేకపోవడం వల్ల ముస్లిం కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ముస్లింలకు అంత్యక్రియలు నిర్వహించేందుకు అనుకూలమైన స్థలం లేకపోవడం సామాజిక, మానవతా పరమైన సమస్యగా మారిందన్నారు. ఈ సమస్యపై పలుమార్లు మండల తహసీల్దార్ విన్నవించుకున్నామని, ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ ప్రజల భావోద్వేగాలను, మతపరమైన అవసరాలను గౌరవిస్తూ సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి శ్మశాన వాటిక కోసం స్థలం గుర్తించి కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. ప్రజల మౌలిక అవసరాలకు ప్రాధాన్యం ఇచ్చి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని కోరారు. సమస్యను పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ముస్లిం మైనారిటీలు పాల్గొన్నారు.

## లెజిస్లేటివ్ స్పోర్ట్స్ మీట్‌లో రాణించిన ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి

**నల్లమాడ (తెలుగోడు), ఫిబ్రవరి 24 :**
విజయవాడ వేదికగా ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో మంగళవారం సాయంత్రం స్టేట్ లెజిస్లేటివ్ స్పోర్ట్ మీట్ 2026లో భాగంగా మహిళా ఎమ్మెల్యేలకు నిర్వహించిన క్రీడల పోటీల్లో పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే సింధూర రెడ్డి అద్భుతంగా రాణించారు. పరుగు పందెంలో పరుగు పందెంలో మొదటి స్థానం మహిళా ఎమ్మెల్సీ గ్రీష్మ ,రెండవ స్థానంలో పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి నిలిచారు. టగ్ ఆఫ్ వార్ క్రీడలో డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు నాయకత్వంలో ఆడిన ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీల జట్టు విజయం సాధించింది. ఈ విజయం సాధించిన క్రీడా జట్టులో పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి కూడా ఉన్నారు.

